మహబూబ్‌నగర్

వార్త
నాగర్‌కర్నూల్ / వనపర్తి / జోగులాంబ గద్వాల / నారాయణపేట

డెడ్‌లైన్ జూన్ 12

- అమ్మ ఆదర్శ పాఠశాల పనులు వేగవంతం
- ప్రతిష్టాత్మకంగా తీసుకున్న ప్రభుత్వం
- పాఠశాలల్లో 5రకాల పనులు
- ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్ల పర్యవేక్షణ
- హెచ్ఎం కన్వీనర్‌గా పాఠశాలల కమిటీల ఏర్పాటు
- మహబూబ్‌నగర్ జిల్లాకు రూ.18.50కోట్లు మంజూరు

పనులను పర్యవేక్షిస్తున్న కలెక్టర్ జి రవినాయక్

మహబూబ్‌నగర్ బ్యూరో,మే24, ప్రభాతవార్త: సర్కారు బడులను బలోపేతం చేసే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తున్నది. విద్యాభివృద్ధికి సర్కార్ చర్యలు తీసుకుంటున్నది. అన్ని పాఠశాలల్లో కనీసం మౌలిక వసతుల కల్పనకు శ్రీకారం చుట్టింది. అందులో భాగంగా ప్రవేశపెట్టిన ఖఅమ్మ ఆదర్శ పాఠశాల' పథకం పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని, ప్రభుత్వ పాఠశాలల బలోపేతమే లక్ష్యంగా ముందుకుసాగుతున్నది.తాగునీరు, కూర్చోవడానికి కుర్చీలు, పాఠశాలలకు విద్యుత్ సౌకర్యం, టాయిలెట్స్ వంటి కనీస వసతులు కల్పించేందుకు నిర్ణయించింది. ఇందులో భాగంగా ప్రభుత్వ పాఠశాలల బలోపేతానికి సర్కారు కృషి చేస్తున్నది. పాఠశాల విద్య నుంచి యూనివర్సిటీ వరకు మౌలిక వసతుల కల్పను పెద్ద ఎత్తున నిధులు విడుదల చేస్తున్నది. ఉపాధ్యాయుల నియామకాలకు సంబంధించిన ప్రక్రియను వేగవంతం చేస్తున్నారు. టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్(టెట్)పరీక్షలు కూడా ప్రస్తుతం కొనసాగుతున్నాయి. పాఠశాల విద్యార్థులకు ఉచితంగా రెండు యూనిఫాంలు అందజేయడంతోపాటు మధ్యాహ్న భోజనం అందజేసి డ్రాప్ అవుట్స్‌ను నియంత్రిస్తున్నది. ఇప్పటికే పాఠ్య పుస్తకాల పంపిణీతోపాటు రాత పుస్తకాల పంపిణీ కి చర్యలు తీసుకుంటున్నది. గతంలో మాదిరిగానే 6వ తరగతి నుంచి విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ చేస్తున్నది. 1వ తరగతి నుంచి 5వ తరగతి వరకు వర్క్ బుక్కులు, 6నుంచి 10వ తరగతి వరకు రాత పుస్తకాలు అందించనున్నారు. ఉమ్మడి జిల్లాలో కస్తూర్బాలు, గురుకులాలు, మోడల్ పాఠశాలలు, అర్బన్ పాఠశాలలు కలిపి 3వేల200కుపైగా ఉన్నాయి. ఇందులో సుమారు 3లక్షలకు పైగా విద్యార్థులు విద్యనభ్యసిస్తున్నారు.

జూన్ 12లోగా పూర్తి చేయాలి : అమ్మ ఆదర్శ పాఠశాల పథకం కింద చేపట్టిన పనులను వచ్చేనెల 12వరకు వందశాతం పూర్తి చేయాల్సి ఉన్నది. ఈమేరకు మే18న సీఎస్ శాంతి కుమారి ఆయా జిల్లాల కలెక్టర్లను ఆదేశించారు. సచివాలయం నుంచి వీడియోకాన్ఫరెన్స్ ద్వారా మార్గదర్శకాలు జారీ చేశారు. మహబూబ్‌నగర్ జిల్లాలో 854 పాఠశాలలకు గానూ 490 పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాలల కార్యక్రమం కిందపనులు చేపట్టారు. ఈమేరకు ప్రభుత్వం నుంచి 18.50కోట్లు మంజూర య్యాయి. ఇందులో మొత్తం 25శాతం నిధులు అంటే రూ.నాలుగున్నర కోట్లు ఇప్పటికే విడుద

జూన్ 10వరకు పూర్తి చేసేలా చర్యలు

అమ్మ ఆదర్శ పాఠశాలల కార్యక్రమం కింద చేపట్టిన పనులను జూన్ 10 వరకు పూర్తి చేసేలా చర్యలు తీసుకుంటున్నాం. మహబూబ్‌నగర్ జిల్లాకు మొత్తం రూ.18.50కోట్లు మంజూరు అయ్యాయి. మొదటి విడుతగా నాలుగున్నర కోట్లతో 490 పాఠశాలల్లో పనులు చేపట్టాం.తాగునీరు, టాయిలెట్, విద్యుత్ సౌకర్యం తోపాటు మైనర్ రిపేర్లు చేపట్టాం.

- గోవర్ధన్ గౌడ్, ప్లానింగ్ కోఆర్డినేటర్, అమ్మ ఆదర్శ పాఠశాలలు కమిటీ

లయ్యాయి. ఇవి ఆయా పాఠశాలల పనులకు సంబంధించి ఎంపీడీవోలకు, మున్సిపల్ కమిషనర్ల పర్యవేక్షణలో పనులు జరగుతున్నాయి. వనపర్తి జిల్లాలో 537 పాఠశాలలు ఉండగా గత ప్రభుత్వం 183 పాఠశాలలు మన ఊరు-మన బడి కింద ఎంపిక కాగా పనులు చేపట్టారు. అమ్మ ఆదర్శ పాఠశాలల కార్యక్రమం ద్వారా 317 పాఠశాలల్లో మరమ్మతు పనులు కొనసాగుతున్నాయి. మహబూబ్‌నగర్ జిల్లాలో కొనసాగుతున్న పాఠశాలల్లో మౌలిక వసతుల పనులను కలెక్టర్ జి రవి నాయక్ తనిఖీ చేశారు. జడ్చర్ల మండలంలోని గంగాపూర్, మిడ్జిల్ మండలంలోని వస్పుల పాఠశాలలో పనులను తనిఖీ చేశారు. పనులు నాణ్యతగా చేపట్టాలని ఆదేశించారు. పాఠశాలలు పునర్ ప్రారంభించేలోగా పనులు పూర్తి చేయాలని సూచించారు.

ఇవీ చేపట్టే పనులు: అమ్మ ఆదర్శ పాఠశాల పథకం కింద ఎంపిక చేసిన స్కూళ్లలో 5రకాల పనులు చేపడుతారు. ఇందులో తాగునీటి వసతి, మైనర్ రిపేర్లు, టాయిలెట్లు వాడుకలోకి తీసుకురావడం, ఎలక్ట్రిసిటీ, అర్బన్ ఏరియాలో టాయిలెట్స్ తప్పని ఏర్పాటు చేయడం వంటి పనులు చేపట్టనున్నారు. విద్యుత్ సౌకర్యం లేకుంటే మరమ్మతు ఏర్పాటు చేయడం, ఉంటే ఇబ్బందులు లేకుండా మరమ్మతు చేయడం, టాయిలెట్లు మంజూరు చేయడం, తాగునీటికి ఇబ్బందులు లేకుండా చూడడం వంటి పనులు చేపట్టనున్నారు. జూన్ 10 వరకు పూర్తి చేయాలని ఆదేశాలు అందినట్లు ఎంపీడీవోలు, కమిషనర్లు చెబుతున్నారు.

తొలిసారి మహిళా సంఘాలకు: సీఎం రేవంత్‌రెడ్డి సారథ్యంలో విద్యాశాఖ కమిషనర్ సూచనల మేరకు తొలిసారి పాఠశాలల మరమ్మతు పనులు మహిళా సంఘాలకు అప్పగించారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన తొలిరోజుల్లోనే మహిళా సంఘాలతో సమావేశం ఏర్పాటు చేసిన సీఎం రేవంత్‌రెడ్డి వారి మరిన్ని పనులు కేటాయించి నిధులు కేటాయించనున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా అమ్మ ఆదర్శ పాఠశాలల పథకం కింద ఎంపికైన ప్రతి పాఠశాల కమిటీ బాధ్యతలను గ్రామ స్థాయిలో విలేజ్ ఆర్గనైజేషన్ (వీవో)గా మున్సిపల్ చైర్‌పర్సన్, ఎంపీడీవోలు ఉంటారు. కమిటీ కన్వీనర్‌గా హెచ్ఎం వ్యవహరిస్తారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీలో క్రియాశీలకంగా పని చేస్తూ కాంట్రాక్ట్ ద్వారా యుద్ధప్రాతిపదికన పనులు చేయిస్తూ మహిళా సంఘాల సభ్యులు ముందుకు సాగం విశేషం.

పనులను పర్యవేక్షిస్తున్న అధికారులు

మరో పదిరోజుల్లో తేలనున్న
ఎంపీ అభ్యర్థుల భవితవ్యం



- గెలుపుపై ఎవరి ధీమా వారిదే..!
- ముక్కోణపు పోటీలో విజయం ఎవరిని వరించునో?!

భూత్పూర్,మే 24,ప్రభాతవార్త: గడిచిన పది రోజుల నుంచి ఆయా పార్టీల అభ్యర్థుల్లో నెలకొన్న ఉత్కంఠకు మరో పది రోజుల్లో తెరపడనుంది.ఈ నెల 13న జిల్లాలోని రెండు పార్లమెంట్ స్థానాల (మహబూబ్‌నగర్, నాగర్‌కర్నూల్) కు ఎన్నికలు జరిగిన సంగతి విధితమే.ఓటింగ్ జరిగిన మరుక్షణం నుంచి అభ్యర్థుల్లో క్షణ క్షణం ఉత్కంఠ నెలకొంది. వీరి భవితవ్యం మరో పది రోజుల్లో తేలనుంది.వచ్చే నెల 4న ఓట్ల లెక్కింపు జరుగనుంది.వాస్తవానికి ఎంత మంది పోటీలో ఉన్నప్పటికి ప్రధానం గా మూడు పార్టీల(బీజేపీ,కాంగ్రెస్,బీఆర్ఎస్)మధ్యే గట్టి పోటీ ఉందని చెప్పవచ్చు.ముక్కోణపు పోటీలో గెలుపెవరిదన్నదీ చెప్పడం అసాధ్యమే అయినప్పటికి, గెలుపుపై మూడు పార్టీల అభ్యర్థులు ఎవరికి వారే ధీమా వ్యక్తం చేస్తు న్నారు.మహబూబ్‌నగర్ పార్లమెంట్ స్థానానికి బీజేపీ నుంచి మాజీ మంత్రి డీకే అరుణ,కాంగ్రెస్ పార్టీ నుంచి సీడబ్లుసీ ప్రత్యేక ఆహ్వానితులు,మాజీ ఎమ్మెల్యే డాక్టర్ చల్లా వంశీ చంద్‌రెడ్డి, బీఆర్ఎస్ నుంచి తాజా మాజీ ఎంపీ మన్నె శ్రీనివాస్‌రెడ్డి ప్రధానంగా పోటీ పడుతున్నారు.ఈ పార్లమెంట్ స్థానం పరిధిలో మహబూబ్‌నగర్,దేవరకద్ర,నారాయణపేట, కొడంగల్, మక్తల్, జడ్చర్ల,షాద్‌నగర్ అసెంబ్లీ సెగ్మెంట్లు వస్తాయి.ఆయా అసెంబ్లీ స్థానాల పరిధిలో ఆయా పార్టీల ఎమ్మెల్యేలు, మాజీ ఎమ్మెల్యేలు,మాజీ మంత్రులు కష్టపడి జనాన్ని సమీకరించడంలోను,ఓట్లు వేయించడంలోను కొంత కృతకృత్యు లయ్యారనే చెప్పాలి.బీజేపీ పార్లమెంట్ అభ్యర్థి డీకే అరుణ గెలుపు కోసం అభ్యర్థితో పాటు బీజేపీ రాష్ట్ర నాయకులు కొండా ప్రశాంత్‌రెడ్డి, డోకూర్ పవన్‌కుమార్‌రెడ్డి, ఎండి ఫారూక్ తదితరులు విస్తృత ప్రచారం చేయగా, కాంగ్రెస్ పార్టీ నుంచి పార్టీ అభ్యర్థి డాక్టర్ చల్లా వంశీ చంద్‌రెడ్డి గెలుపు కోసం అభ్యర్థితో పాటు డీసీసీ అధ్యక్షుడు,దేవరకద్ర ఎమ్మెల్యే జి మధుసూధన్‌రెడి (జీఎంఆర్)తో పాటు ఎమ్మెల్యేలు అనురుద్‌రెడ్డి, పర్ణికారెడ్డి ఇతర ముఖ్యనేతలు ప్రచారంలో పాల్గొని ఓటర్లనాకర్శించడంలో కొంత కృతకృత్యులయ్యారనే చెప్పాలి. ఇక బీఆర్ఎస్ పార్టీ నుంచి అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డితో పాటు మాజీ మంత్రి శ్రీనివాస్‌గౌడ్, మాజీ ఎమ్మెల్యేలు ఆల వెంకటేశ్వర్‌రెడ్డి,డాక్టర్ లక్ష్మారెడ్డి,ఎస్ఆర్‌రెడ్డి,అంజయ్య యాదవ్‌లు పాల్గొని పార్టీ అభ్యర్థి మన్నె శ్రీనివాస్‌రెడ్డి గెలుపుకోసం ప్రచారంలో పాల్గొన్నారు.ఈ సారి పార్లమెంట్ ఎన్నికల్లో 70నుంచి75శాతం ఓటింగ్ జరుగగా గెలుపుపై ఆయా పార్టీలు భారీ అంచనాలతో ధీమా వ్యక్తం చేస్తున్నారు.

ప్రాణం తీసిన ఈత సరదా..
- స్నేహితులు చూస్తుండగానే ప్రాణం పోయింది

మహబూబ్‌నగర్ బ్యూరో, మే 24,ప్రభాతవార్త : ఈతకు వెళ్లి ఓ యువకుడు ప్రాణం పోయిన సంఘటన నవాబుపేట మండలంలో చోటుచేసుకున్నది. వివరాల్లోకి వెళ్తే.. మండలంలోని యన్మన్‌గండ్ల గ్రామానికి చెందిన మంగలి హరిబాబు కుమారుడు ఆంజనేయులు(26)శుక్రవారం మధ్యాహ్నం తన స్నేహితులతో కలిసి గ్రామ సమీపంలోని పెద్ద చెరువులో ఈత కొట్టడానికి వెళ్లాడు. ఈత కొడుతూ అలాగే చెరువు మధ్యలోకి వెళ్లడంతో తిరిగి రావడానికి దమ్ము రావడంతో ఊపిరి ఆడలేదు. తోటి స్నేహితులు గమనించి బయటకులాగే ప్రయత్నం చేసినావారి శక్తి సరిపోలేదు.మిత్రులు చూస్తుండగానే నీట మునిగి ప్రాణం వదిలాడు. విషయాన్ని గ్రామస్తులకు తెలుపడంతో మృతదేహం కోసం గాలిస్తున్నారు. చీకటి పడేవరకు ఎలాంటి ఆచూకీ లభించలేదని గ్రామస్తులు తెలిపారు.

నర్సరీలపై ప్రత్యేక శ్రద్ధ వహించాలి

వన నర్సరీలను పరిశీలిస్తున్న ఎంపీడీఓ ఇసాక్ హుస్సేన్

కల్వకుర్తి, మే 24 ప్రభాతవార్త: గ్రామాల్లో నిర్వహిస్తున్న నర్సరీలపై ప్రత్యేకమైన శ్రద్ధ వహించాలని ఎంపీడీఓ ఇసాక్ హుస్సేన్ అన్నారు. శుక్రవారం మండల కేంద్రంలోని రామచంద్రపురం, వంకరాయితండా, శాంతిగూడెం గ్రామాల్లో గల నర్సరీలను, కంపోర్టు షెడ్లను, స్మశాన వాటికలను ఎంపీఓ వెంకటేష్‌తో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లో పారిశుధ్య సమస్యలు తలెత్తకుండా చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కంపోస్టు షెడ్డులను సక్రమంగా నిర్వహించాలని, తడి,పొడి చెత్తలను వేరుచేయాలన్నారు.గ్రామాల్లో పారిశుధ్య నివారణ చర్యలు చేపట్టాలన్నారు.ప్రత్యేకాధికారులు గ్రామాలాభివృద్ధిపైప్రత్యేక దృష్టి సారించాలన్నారు. కార్యక్రమంలో పంచాయతీ సెక్రటరీలు నజీమా సుల్తానా, పవన్‌కుమార్, హరిక ఉన్నారు.

అంగరంగా వైభవంగా పెద్ద రథోత్సవం

వెల్దండ, మే24 ప్రభాతవార్త: మండల పరిధిలోని భైరాపూర్ గ్రామంలో వెలిసిన స్వయంభూ శ్రీ లక్ష్మినరసింహ్మస్వామి బ్రహ్మోత్సవాలు ఈ నెల 20 నుంచి అత్యంత భక్తి శ్రద్ధలతో కన్నుల పండువగా కొనసాగుతున్నాయి. శుక్రవారం తెల్లవారుజామున స్వామి వారి రథోత్సవాన్ని పూలహారాలతో అలంకరించి స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించి రథోత్సవంపై ఉంచారు. రథోత్సవ కార్యక్రమానికి భక్తులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వామి వారి రథోత్సవాన్ని లాగారు. ప్రాంతమంతా లక్ష్మినరసింహ్మస్వామి నామస్మరణతో మారుమోగింది. ఈ కార్యక్రమంలో డాక్టర్ జగన్మోహన్‌రెడ్డి, బీజేపీ నియోజకవర్గ ఇన్‌చార్జి శేఖర్‌రెడ్డి, జంగయ్యయాదవ్, మోహన్‌రెడ్డి, మాజీ సర్పంచ్ దార్లకుమార్, యాదయ్య, మాజీ ఉప సర్పంచ్ రమేష్‌గౌడ్, నాయకులు రాజుయాదవ్, రవీందర్‌రెడ్డి, మౌనేష్, శ్రీశైలం, జంగయ్య తదితరులు ఉన్నారు.

రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

నకిలీగాళ్లను వదిలిపెట్టం..

- అవసరమైతే పీడీ యాక్టులు నమోదు చేస్తాం
- మీడియా సమావేశంలో ఏఎస్పీ రాములు
- గోప్లాపూర్‌లో పోలీస్, వ్యవసాయ శాఖ అధికారుల దాడులు
- 3క్వింటాళ్ల 20కేజీల నకిలీ విత్తనాలు పట్టివేత
- నిషేధిత బీటీ3 విత్తనాలుగా గుర్తించిన డీఏవో వెంకటేశ్

శాంపిళ్లు సేకరించిన అధికారులు

మహబూబ్‌నగర్ బ్యూరో, మే 24, ప్రభాతవార్త: నకిలీ విత్తనాలు విక్రయించి అమాయక రైతులను మోసం చేస్తూ ఇబ్బందులకు గురిచేస్తున్న నకిలీవ్యాపారులను వదిలిపెట్టమని, అవసరమైతే పీడీ యాక్టు సైతం నమోదు చేస్తామని ఏఎస్పీ రాములు తెలిపారు. జడ్చర్ల మండలంలోని గోప్లాపూర్ గ్రామంలో నకిలీ పత్తివిత్తనాలు విక్రయిస్తున్నారన్న సమాచారం మేరకు పోలీస్, వ్యవసాయ శాఖ అధికారులు సంయుక్తంగా నిర్వహించిన దాడుల్లో నకిలీ పత్తివిత్తనాలు పట్టుబడినట్లు ఏఎస్పీ రాములు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మీడియాకు వివరాలు వెల్లడించారు. గోప్లాపూర్

పట్టుబడ్డ నకిలీ విత్తనాలు

వివరాలు వెల్లడిస్తున్న ఏఎస్పీ రాములు

గ్రామంలో ప్రభాకర్‌రెడ్డి, సుధాకర్‌రెడ్డి అనే వ్యక్తులు నకిలీ విత్తనాలు విక్రయిస్తున్నారని సమాచారం అందడంతో పోలీసులు శుక్రవారం దాడులు నిర్వహించారు. నకిలీ పత్తివిత్తనాలను గుంటూరు నుంచి తీసుకొచ్చి అమాయక రైతులను విక్రయిచేందుకు సిద్ధంగా ఉంచడంతో పక్కా సమాచారం మేరకు దాడులు చేశారు. 3 క్వింటాళ్ల 20కేజీల విత్తనాలు పట్టుబడడంతో నిందుతులను పోలీస్ స్టేషన్‌కు తరలించి మీడియా ముందు ప్రవేశపెట్టారు. పట్టుబడ్డ విత్తనాల విలువ సుమారు రూ.మూడున్నర లక్షల వరకు ఉంటుందని తెలిపారు. నకిలీ విత్తనాలు విక్రయిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు.కలెక్టర్,ఎస్పీ ఆదేశాలు మేరకు మహబూబ్‌నగర్ జిల్లాలో నకిలీ విత్తనాల ముఠాను పట్టుకునేందుకు నిరంతరంగా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ఇందులో భాగంగా జిల్లాలో 17మండలాల టీంలు, ఒక జిల్లా బృందం కలిసి తనిఖీలు చేపడుతున్నట్లు వెల్లడించారు. వీరితోపాటు సీఐ,ఎస్సై, వ్యవసాయ శాఖ అధికారులు సంయుక్తంగా చర్యలు తీసుకుంటు న్నట్లు తెలిపారు. జిల్లా చెక్ పోస్టుల వద్ద తనిఖీలు ముమ్మరం చేశామన్నారు. రైతులకు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నామన్నారు.ఇండ్లలో దాచిపెట్టి రైతులకు విక్రయించే వారికి నకిలీ విత్తనాలపై కూడా ప్రత్యేకంగా ఫోకస్ పెట్టామని, నకిలీగాళ్లను వంద శాతం పట్టుకుంటామని,రైతులకు ఇబ్బందులు లేకుండా మోసపోకుండా చర్యలు తీసుకుంటామని ఏఎస్పీ తెలిపారు. అనంతరం డీఏవో వెంకటేశ్ మాట్లాడుతూ ప్యాకింగ్ చేయని, లూస్ విత్తనాలను రైతు కొనొద్దని సూచించారు. డీలర్ల వద్ద కొన్న ప్రతి విత్తనాలకు బిల్లు తీసుకోవాలని, లైసెన్స్ ఉన్న డీలర్ వద్దే ఎమ్మార్పీ ధరలకే విత్తనాలు కొనుగోలు చేయాలని సూచించారు. గ్రామ స్థాయిలో వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నామని తెలిపారు. కార్యక్రమంలో డీఏవో వెంకటేశ్, జడ్చర్ల సీఐ ఆదిరెడ్డి పాల్గొన్నారు.

ఘనంగా వాసవీమాత పల్లకిసేవ
-అలంకరణలో దర్శనమిచ్చిన అమ్మవారు

దేవరకద్ర,మే 24 ప్రభాతవార్త: దేవరకద్రలోని శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో శుక్రవారం అమ్మవారి పల్లకిసేవ కార్యక్రమాన్ని అత్యంత ఘనంగా నిర్వహించారు. ప్రతి శుక్రవారం అమ్మవారి పల్లకిసేవ కార్యక్రమాన్ని నిర్వహిస్తారు. అందులో భాగంగానే ఈ పవిత్ర కార్యక్రమాన్ని నిర్వహించారు.అలాగే అమ్మవారికి అభిషేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారిని పల్లకిలో తీసుకొని దేవస్థానం చుట్టూ ప్రదిక్షణలు నిర్వహించారు. పురోహితుల వేదమంత్రాలు,భక్తులు హరినామస్మరణల మధ్య ఈ సేవ ముందుకు కదిలింది. అనంతరం అర్చకుడు హరి శంకరశర్మ అధ్వర్యంలో అమ్మవారికి ప్రత్యేక అభిషేకాలు,అర్చనలు తదితర పూజలు నిర్వహించారు.ఈ సందర్భంగా వాసవిమాత అమ్మవారు భక్తులకు అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు.

ఘనంగా కుంకుమార్చన: దేవస్థానంలో శ్రీ చక్రాలతో అమ్మవారికి కుంకుమార్చన పూజా కార్యక్రమాన్ని నిర్వహించారు. అలాగే అలితా సహస్రనామపారాయణం కార్యక్రమాన్ని కూడ నిర్వహించారు.

వాసవీమాత అమ్మవారికి పూజలు చేస్తున్న భక్తులు

పంచామతాలతో అమ్మవారికి ప్రత్యేక అభిషేక పూజ నిర్వహించారు.మహామంగళహారతి,ప్రసాదవితరణ తదితర కార్యక్రమాలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం కమిటీ అధ్యక్షుడు కల్వకన్నయ్యశెట్టి,మహిళాసంఘం అధ్యక్షురాలు గుద్దేటి మంజుల రాణి,జిల్లా విశ్వహిందూ పరిషత్ అధ్యక్షుడు గుద్దేటి చంద్రయ్యలతో పాటు స్థానిక ఆర్యవైశ్యులు అధికసంఖ్యలో పాల్గొన్నారు.

కుక్కలనూ తరలించండి

- పందుల బెడద పోయింది..కుక్కల బెడద మొదలైంది
- జడ్చర్లలో విచ్చలవిడిగా శునకాలు స్వైరవిహారం
- వేసవి సెలవులతో ఇంటి వద్దే చిన్నారులు
- ప్రమాదం జరగకముందే మేలుకోవాలంటున్న జనం
- మున్సిపల్ అధికారులూ స్పందించంటూ పట్టణవాసుల వేడుకోలు

పద్మావతీ కాలనీలో గుంపులుగా సంచరిస్తున్న శునకాలు

మహబూబ్‌నగర్ బ్యూరో, మే 24,ప్రభాతవార్త: కుక్కలను చూడగానే చెప్పలేనంత భయం పుట్టుకొస్తున్నది. పదుల సంఖ్యలో ఒకేసారి ఎదురైతే ఎవరికైనా భయం వేయక తప్పదు. గతంలో హైదరాబాద్‌తోపాటు ఇతర ప్రాంతాల్లో చిన్నపిల్లలను శునకాలు పొట్టనబెట్టుకున్న ఘటనలు ఎన్నో ఉన్నాయి. జడ్చర్ల మున్సిపాలిటీలో శునకాల బెడదతో జనాలు ఇబ్బంది పడతున్నారు. పదుల సంఖ్యలో గుంపులుగా కుక్కలు సంచరిస్తూ జనాలను భయభ్రాంతులకు గురి చేస్తున్నాయని ఆందోళన చెందుతున్నారు. రాత్రిళ్ల బయట వాకింగ్ చేయాలంటూ భయం వేస్తుందని చెబుతున్నారు. ఉదయం, సాయంత్రం వేళల్లో పిల్లలను బయటికి పంపాలంటే జంకుతున్నారు. చిన్నపిల్లలను కిరాణం దుకాణాలకు, ఆడుకోవానికి సైతం ఒంటరిగా పంపడానికి కూడా భయపడుతున్నారు. ఇప్పటికే కుక్కలు కరిచిన ఘటనలు లేకపోలేదు. అయితే ప్రాణనష్టం జరిగేంత సంఘటనలు జరగలేదు. ఎలాంటి నష్టం జరగకముందే అధికారులు, పాలకవర్గం స్పందించాలని జడ్చర్ల పట్టణవాసులు వేడుకుంటున్నారు.

పందుల బాధ తీరింది..

గతంలో మున్సిపాలిటీ పరిధిలో పందులు స్వైరవిహారం చేసేవి. వరాకాలం వచ్చిందంటే రోగాల బారిన పడేవారు. పదుల సంఖ్యలో పందులు ఇండ్ల మధ్యే, రోడ్డుకు ఇరువైపులా, డ్రైనేజీ కాలువల్లో సంచరించడంతో అపరిశుభ్రత కారణంగా దోమలు, ఈగలు వ్యాప్తి చెంది మలేరియా, డెంగీ బారిన పడ్డ సంఘటనలు కోకొల్లలు. అయితే మున్సిపల్ పాలకవర్గం, అధికారులు కలిసి పట్టణంలోని మొత్తం పందులను రాత్రికి రాత్రే తరలించడంతో ఒక్కసారిగా సమస్య తీరింది. జడ్చర్ల పట్టణవాసులు ఒక్కసారిగి ఊపిరి పీల్చుకున్నంత పనైంది. నేడు మున్సిపాలిటీలో ఒక్క పంది కూడా కనిపించడంలేదు. ఇదిలా ఉండగా పందులను బెంగళూరు లాంటి ఇతర ప్రాంతాలకు తరలించి సొమ్ము చేసుకున్నారని ఆరోపణలు వెల్లువెత్తాయి. అయితే పందులను అమ్మగా వచ్చిన సొమ్ము మున్సిపాలిటీకి చెల్లించలేదు. ఈక్రమంలో కొన్ని రోజులు తతంగం నడిపి చివరికి నిందితులపై కేసులు కూడా నమోదు చేశారు. ఇదంతా ఇలా ఉండగా పందుల బెడదను తప్పించారని, అలాగే కుక్కల బెడద నుంచి కూడా తప్పించి, మున్సిపాలిటీ పరిధిలోని శునకాలను మొత్తం తరలించాలని ప్రజలు కోరుతున్నారు. ఇదే విషయమై సోషల్ మీడియాలో చర్చ జరగడం గమనార్హం.

పిల్లల విషయంలో..

పిల్లల విషయంలో తల్లిదండ్రులు జాగ్రత్తలు తీసుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉన్నది. పిల్లలను ఒంటరిగా బయటకు పంపకుండా ఉంటే మంచిది. ఇటీవల జరిగిన వలు సంఘటనల్లో పిల్లలు వెళ్తున్న సందర్భంలోనే శునకాలు దాడి చేసినట్లు సీసీ పుటేజీల ద్వారా తెలుసున్నది. ఇప్పటికే మున్సిపల్ అధికారులు అవగాహన కల్పించినా గ్రామాల్లో అంత ప్రభావం కనిపించట్లేదని చెబుతున్నారు. అధికారులు, ప్రజాప్రతినిధులు జోక్యం చేసుకుని కుక్కల బెడదను తొలగించాలని పట్టణవాసులు కోరుతున్నారు.

రొడ్డు ప్రమాదంలో ఇరువురు మృతి

లారీ బైక్‌ను ఢీకొట్టిన సంఘటనలో మృతిచెందిన ఇరువురు వ్యక్తులు

భూత్పూర్,మే 24,ప్రభాతవార్త: శుక్రవారం సాయంత్రం ధర్మాపూర్‌కు సమీపంలోని ఆల్మ దీనా బీఈడీ కళాశాలకు ఎదురుగా రొడ్డుపై ఎదురె దురుగా వస్తున్న లారీ-బైక్ ఢీకొన్న సంఘటనలో భూత్పూర్ మండలం మద్దిగట్లగ్రామానికి చెందిన ఇరువురు బండమీది బాబు(50),పల్లె శ్రీకాంత్(25)లు అక్కడికక్కడే మృతి చెందినట్లు రూరల్ ఎస్సై విజయ్ కుమార్ తెలిపారు.దేవరకద్ర నుంచి మహబూబ్‌నగర్ వైపు టీఎస్ 06 ఈవీ 1092నెంబర్ గల బైక్‌పై వరుసకు మామ -అల్లుళ్లయిన బండమీది బాబు,పల్లె శ్రీకాంత్‌లు వస్తుండగా ఎదురుగామహబూబ్‌నగర్ నుంచి దేవరకద్ర వైపువెళ్లే కెఎ34సీ 7116 నెంబర్ గల ఢీకొట్టడంతో బైక్‌పై వస్తున్న ఇరువురు అక్కడికక్కడే మృతి చెందినట్లు ఎస్సై తెలిపారు.ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లుమహబూబ్‌నగర్ రూరల్ ఎస్సై విజయ్‌కుమార్ తెలిపారు.

కుట్టు మిషన్ శిక్షణ పూర్తిచేసిన వారికి సర్టిఫికెట్లు అందజేత

సర్టిఫికెట్లు అందజేసిన దృశ్యం

మక్తల్, మే 24 ప్రభాతవార్త: నారాయణపేట జిల్లా మహిళా సాధికారత కేంద్రం ఆధ్వర్యంలో భేటీ బచావో భేటీ పడావో పథకంలో భాగంగా ఏర్పాటు చేసి 45 రోజులపాటు ఉచిత టైలరింగ్ శిక్షణ నిన్నటితో పూర్తయింది. ఈ సందర్భంగా మక్తల్ మండల కేంద్రంలోని సర్టిఫికెట్లను జిల్లా సంక్షేమ అధికారి నర్సింహారావు అందజేశారు. కార్యక్రమంలో మక్తల్ సిడిపిఓ సరోజిని, జిల్లా మహిళా సాధికారత కో ఆర్డినేటర్ నరసింహ, విజయ్, అనిత, శ్రావణి, స్వప్న, రేణుక పాల్గొన్నారు.

పాఠశాల అభివృద్ధి పనుల పరిశీలకుల నియామకం

ఉప్పునుంతల,మే 24 ప్రభాతవార్త : మండలంలోని ఆయా పాఠశాలలో జరుగుతున్న అభివృద్ధి పనుల పురోగతిని పరిశీలించుటకు ప్రత్యేక పరిశీలకులను నియమించారు. ఉప్పునుంతల, అచ్చంపేట, పదర, అమ్రాబాద్ మండలాలలో పాఠశాలలో అభివృద్ధి పనులను పరిశీలించుటకు జిల్లా అసిస్టెంట్ మానిటరింగ్ అధికారి మహ్మద్ షర్ఫుద్దిన్‌ను నియమించినట్లు జిల్లా విద్యాశాఖ అధికారి గోవిందరాజులు ఉత్తర్వులు జారీ చేశారు. ఆయా మండలాలలో మన ఊరు, మన బడి, పిఎంశ్రీ, అమ్మ ఆదర్శ పాఠశాలల అభివృద్ధి, తదితర కార్యక్రమాల అభివృద్ధి పనులను ఆయన పరిశీలించనున్నట్లు పేర్కొన్నారు.

లక్ష్మీపల్లిలో ఎస్సీ రక్షితమూర్తి పరిశీలన

చిన్నంబావి,మే 24 ప్రభాతవార్త: రాష్ట్రంలో సంచలనం సృష్టిస్తున్న టిఆర్ ఎస్ కార్యకర్త బొడ్డు శ్రీధర్‌రెడ్డి హత్య జరిగిన చిన్నంబావి మండలం లక్ష్మిపల్లి గ్రామంలో సంఘటన స్థలాన్ని వనపర్తి జిల్లా ఎస్పీ కె. రక్షితమూర్తి పరిశీలించారు. బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తుల చేతిలో శ్రీధర్‌రెడ్డి దారుణహత్యకు గురికాగా గురువారం పోలీస్ జాగిలాలతో పరిశోధించడం జరిగింది. గురువారం నుండి గ్రామంలో 144 సెక్షన్ విధించి గస్తీ నిర్వహించారు. ఈ సంఘటనపై దర్యాప్తులో భాగంగా జిల్లా ఎస్పీ గ్రామాన్ని సందర్శించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. అనంతరం చిన్నంబావి పోలీస్ స్టేషన్‌ను సందర్శించి దర్యాప్తు నిర్వహిస్తున్న పోలీస్ అధికారులతో సమావేశం అయ్యారు. హత్యా సంఘటనపై వనపర్తి సిఐ నాగభూషణరావు ఆధ్వర్యంలో దర్యాప్తు ముమ్మరం చేశారు. శుక్రవారం సాయంత్రం జిల్లాలోని పలువురు ఎస్సైలు ఆధ్వర్యంలో లక్ష్మిపల్లి గ్రామంలో ప్రతి ఇంటిని కార్డెన్ సెర్చ్ నిర్వహించి వివరాలు తెలుసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా స్థాయిలోని వివిధ మండలాల ఎస్సైలు, 100 మంది పోలీసులు కార్డెన్ సెర్చ్‌లో పాల్గొన్నారు.

కోడేరు మండలంలో ఎస్సీ సర్పంచ్‌ల స్థానాలు పెంచాలని వినతి

నాగర్‌కర్నూల్ ప్రతినిధి, మే 24 ప్రభాతవార్త: కోడేరు మండలంలో ఎస్సీ సర్పంచ్‌ల స్థానాలు పెంచాలని, జనంపల్లి గ్రామ పంచాయతీని ఎస్సీ రిజర్వేషన్‌కు కేటాయించాలని గ్రామ దళితులు కేవీపీఎస్ జిల్లా అధ్యక్షులు అంతటి కాశన్న ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఏఓ చంద్రశేఖర్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కోడేరు మండలం, జనంపల్లి గ్రామంలో స్వాతంత్ర ం వచ్చి ఇన్ని రోజులైన గ్రామంలో ఎస్సీ రిజర్వేషన్ సర్పంచ్‌గా ఏర్పాటు కాలేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ప్రభుత్వం ఎప్పుడు ఎన్నికలు నిర్వహించిన బీసీ, జనరల్ మాత్రమే రిజర్వేషన్లు కేటాయిస్తున్నారని, ఎస్సీ రిజర్వేషన్ కేటాయించడం లేదన్నారు. నూతనంగా ఏర్పాటు అయిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆలోచించి జనంపల్లి గ్రామానికి ఎస్సీ రిజర్వేషన్ కేటాయించాలన్నారు. వినతి పత్రం అందించిన వారిలో శివశంకర్ వరప్రసాద్, ధర్మేంద్ర, శ్రీను,నాగశేషయ్య, శ్రీను, నాగరాజు తదితరులు ఉన్నారు.

నాటిన ప్రతి మొక్కను బ్రతికిద్దాం..!

వెల్దండ, మే 24 ప్రభాతవార్త: నాటిన ప్రతి మొక్కను బ్రతికిద్దామని ఎంపీడీఓ సత్యపాల్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని తిమ్మినోని పల్లి-రాచూర్ గ్రామాల్లో వననర్సరీలు, డీకంపోస్ట్ షెడ్, రోడ్డు వెంట నాటిన మొక్కలను పరిశీలించి నీరు పోశారు. వేసవి దృష్ట్యా నర్సరీల్లో పెంచుతున్న మొక్కలతో పాటు కాలనీల్లో ఇరువైపులా నాటిన మొక్కలకు నీరు పోసి ఎప్పటికప్పుడు సంరక్షించాలన్నారు. కార్యక్రమంలో ఎపీఓ ఈశ్వర్‌జీ, ఈసీ దేవేందర్‌గౌడ్‌తో పాటు తదితరులు ఉన్నారు.

రూ.2409 ధర పలికిన సోన

దేవరకద్ర,మే 24 ప్రభాతవార్త: దేవరకద్ర వ్యవసాయమార్కెట్ యార్డుకు శుక్రవారం రైతులు 32 కింటాళ్ళ సోన(ఆర్‌ఎన్‌ఆర్) ధాన్యాన్ని విక్రయానికి తీసుకవచ్చారు.వీటికి అత్యధికంగా కింటాల్‌కు రూ.2409 ధర పలికింది.అతి తక్కువగా రూ.1909 ధర పలికినట్లు మార్కెట్ అధికారులు తెలిపారు.

నకిలీ విత్తనాలు అరికట్టేందుకు కఠిన చర్యలు తీసుకోవాలి

● మహబూబ్‌నగర్ జిల్లా కలెక్టర్ జి.రవినాయక్

మాట్లాడుతున్న కలెక్టర్ రవినాయక్

మహబూబ్‌నగర్ బ్యూరో,మే24 ప్రభాతవార్త: నకిలీ విత్తనాలు విక్రయించకుండా వ్యవసాయ శాఖ, పోలీస్ శాఖ అధికారులతో ఏర్పాటు చేసిన టాస్క్‌ఫోర్స్ టీములు కఠిన చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ జి. రవినాయక్ ఆదేశించారు. శుక్రవారం సమీకృత కలెక్టరేట్ కార్యాలయంలో వ్యవసాయ శాఖ అధికారులు, పోలీస్ శాఖ అధికారులతో జిల్లా స్థాయి సమన్వయ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మండలంలో వ్యవసాయ అధికారులు విత్తన డీలర్ ఔట్ లెట్‌లను అన్ని తనిఖీలు నిర్వహించాలని అన్నారు. విత్తన డీలర్ ఔటెలెట్‌లలో విత్తన లైసెన్స్, వ్యాలిడిటీ చెక్ చేయాలని, అదేవిధంగా వచ్చిన విత్తన స్టాక్, రేట్ బోర్డుపై రాయాలని సూచించారు. విత్తన డీలర్ రైతులకు విత్తనం విక్రయానికి సంబంధించి రశీదు ఇవ్వాలని అన్నారు. వ్యవసాయ సీజన్‌లో నకిలీ విత్తనాల వలన రైతులు పంట దిగుబడి రాక నష్టపోయే ప్రమాదంఉందని, వ్యవసాయ,పోలీస్ అధికారులు అప్రమత్తంగా ఉండాలని, స్థానిక ఇంటెలిజెన్స్ సమాచారం తీసుకోవాలని, నకిలీ విత్తనాలు అమ్మితే వారిపై టాస్క్‌ఫోర్స్ టీమ్ వెంటనే చర్యలు తీసుకోవాలని అన్నారు. విత్తనాలు ఎక్కడ నుంచి రైతు దగ్గర నుంచి, గ్రామంలో విత్తన డీలర్ ఔట్‌లెట్, బయట నుంచి తీసుకువచ్చి విక్రయం చేస్తున్నారా, మధ్య వర్తుల ద్వారా విక్రయం చేస్తున్నారా తదితర అంశాలు వ్యవసాయ అధికారులు పరిశీలించాలని అన్నారు. నకిలీ విత్తనాల వలన గతంలో పంట నష్ట పోయిన ప్రాంతాల వివరాలు తదితర సమాచారం డేటా ఉండాలని అన్నారు. బయట మార్కెట్ నుండి ఒకటే బ్రాండ్ విత్తనం తక్కువ ధరకు అమ్మితేపరిశీలించాలని అన్నారు.నకిలీ విత్తనా బారిన పడకుండా వ్యవసాయశాఖ లైసెన్స్ పొందిన డీలర్ దగ్గరనే రైతులు కొనేలా వ్యవసాయ శాఖ అధికారులు రైతులకు అవగాహన కలిగించాలని అన్నారు. విత్తన డీలర్ నుండి రసీదు తీసుకోవాలని, విత్తన పాకెట్ పంట కోత వరకు భద్రంగా ఉంచుకోవాలని సూచించారు. లూజ్ పాకెట్‌లు, పగిలిన సంచులు, డబ్బాల విత్తనాలు, గడువు ముగిసిన విత్తనాలు కొనుగోలు చేయరాదని తదితర విషయాలపై రైతులకు వ్యవసాయ శాఖ అధికారులు అవగాహన కలిగించాలని అన్నారు. జిల్లా వ్యవసాయ శాఖ అధికారి వెంకటేశ్వర్లు మాట్లాడుతూ వ్యవసాయ శాఖ మండల అధికారులు, ఏఈఓల ద్వారా ప్రతి గ్రామంలో రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు, రైతులకు నాణ్యమైన విత్తనాలు కొనుగోలుపై జాగ్రత్తలపై అవగాహన కలిగించనున్నట్లు తెలిపారు.

హాజరైన వ్యవసాయ, రెవెన్యూ పోలీస్ అధికారులు

పంటల సాగులో నాణ్యమైన విత్తన ఎంపిక కీలకం

వ్యవసాయ సహా పరిశోధన సంచాలకులు డా. టి.మల్లారెడ్డి

రైతుమేళాలో విత్తన బస్తాలను అందజేస్తున్న శాస్త్రవేత్తలు

బిజినపల్లి,మే 24 ప్రభాతవార్త : పంటల సాగులో నాణ్యమైన విత్తన ఎంపిక కీలకం అని తద్వారానే ఆశించిన మేర దిగుబడులు పొందడానికి అవకాశముంటుందని పాలెం వ్యవసాయ పరిశోధన స్థానం సహ పరిశోధన సంచాలకులు డా. టి. మల్లారెడ్డి అన్నారు. ప్రాంతీయ వ్యవసాయ పరిశోధనా స్థానంలో శుక్రవారం విత్తనమేళా నిర్వహించారు. సహ పరిశోధన సంచాలకులు డా. టి. మల్లారెడ్డి మాట్లాడుతూ శాస్త్రీయ, మేలైన యాజమాన్య పద్ధతుల్లో పంటలు సాగుచేస్తే అధిక దిగుబడులు పొందవచ్చన్నారు. ధర తక్కువనో, లేదా ఇతరులు చెప్పే మాటలు నమ్మి నాణ్యత లేని విత్తనాలు కొనుగోలు చేయవద్దన్నారు. నేల స్వభావాన్ని బట్టి పంటలు సాగు చేయాలన్నారు. భూసార పరీక్షలు చేయించుకుంటే ఎంతవరకు పంటకు ఎరువులు అవసరమో తెలుస్తుందన్నారు. తద్వారా పెట్టుబడి ఖర్చు తగ్గుతుందన్నారు. రైతులు ఎప్పటికప్పుడు శాస్త్రవేత్తల సూచనలు పాటించి అధిక దిగుబడులు పొందాలని సూచించారు. రైతాంగానికి కావలసిన నాణ్యమైన విత్తనాలను అందించేందుకు తమ పరిశోధన స్థానాలు ఎప్పటికప్పుడు కృషి చేస్తూ ఉంటాయని చెప్పారు. ప్రధాన పంటలైన వరి, వేరుశనగ, తెల్లజొన్న, పచ్చజొన్న, కంది, మినుము, పెసర, ఆముదం, ఉలవలు, చిరుధాన్యాలైన రాగి, సజ్జ, కొర్ర విత్తనం అందుబాటులో ఉంచామన్నారు. వచ్చే నెలలో నైఋతి ఋతుపవనాలు తెలంగాణలో ప్రవేశిస్తున్నాయని రైతులు నేల చలువకు వచ్చిన తర్వాతనే విత్తుకోవాలని సూచించారు. వ్యవసాయ కళాశాల అసోసియేట్ డీన్ డా. పుష్పవతి మాట్లాడుతూ పంటల్లో ప్రధానంగా ఆశించే తెగుళ్లను సరైన సమయంలో గుర్తించి తగిన యాజమాన్య పద్ధతులు పాటించినప్పుడు ఆశించిన దిగుబడిని పొందగలుగుతామన్నారు. నాబార్డు డిడిఎం మనోహర్‌రెడ్డి మాట్లాడుతూ పంటల సాగులో రైతులు, శాస్త్రవేత్తల సూచనలు పాటించాలని, నాబార్డు సేవలను రైతాంగం సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఏరువాక కేంద్రం కో ఆర్డినేటర్ డా. భరత్ భూషణ్‌రావు మాట్లాడుతూ వానాకాలం సాగుకు సిద్ధమవుతున్న రైతాంగం ప్రధానంగా పాటించాల్సిన వివిధ యాజమాన్య పద్ధతులపై వివరించారు. కెవికె కో ఆర్డినేటర్ డా. టి. ప్రభాకర్‌రెడ్డి మాట్లాడుతూ సాగు పంటల్లో ప్రధాన యాజమాన్య పద్ధతులను పాటించాలని కోరారు. పత్తి సాగులో అధిక సాంద్రత కీలక అంశాలపై విమర్శించారు. వివిధ పంటల్లో మొదటి దఫాలో వేయాల్సిన ఎరువుల యాజమాన్యంపై తెలియజెప్పారు. పలువురు శాస్త్రవేత్తలు మాట్లాడుతూ విత్తనశుద్ధి అధిక దిగుబడిని పొందడానికి ఆచరించాల్సిన కీలక యాజమాన్యం, వివిధ పంటల్లో విలువ ఆధారిత ఉత్పత్తుల తయారీ మొదలైన అంశాలపై రైతులకు తెలియజేశారు. విత్తనమేళా శాస్త్రవేత్తలు రైతుల చర్చ గోష్టిలో రైతులు సాగులో ఎదురయ్యే సమస్యలు సవాళ్లపై చర్చించారు. వాటిని పరిష్కరించుకునేందుకు శాస్త్రవేత్తల సలహాలు, సూచనలు తెలియజేశారు. విత్తనం మేళాలో అభ్యుదయ రైతులను సన్మానించి అభినందించారు. పలువురు రైతులకు విత్తన బస్తాలు అందించారు. కార్యక్రమంలో టిఎస్ఎస్ ఓసిఏ ఏడిఎస్‌సిజె చంద్రశేఖర్, ఆర్ఇఏసి లావణ్య రమణారెడ్డి, ఏడిఏ పూర్ణచంద్రారెడ్డి, శాస్త్రవేత్తలు, కెవికె సిబ్బంది, ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని రైతాంగం పాల్గొన్నారు.

రైతు మేళాలో పాల్గొన్న రైతులు

రైతుమేళాలో మాట్లాడుతున్న డా. టి. మల్లారెడ్డి

పెనిమిళ్లలో ఘనంగా బొడ్రాయి వార్షికోత్సవం

ప్రత్యేక పూజలు జరిపిన అచ్చంపేట ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ

బోనాల ఊరేగింపులో పాల్గొన్న అచ్చంపేట ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ

ఉప్పునుంతల,మే 24 ప్రభాతవార్త: మండలంలోని పెనిమిళ్ళ గ్రామంలో శుక్రవారం బొడ్రాయి వార్షికోత్సవం ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అచ్చంపేట ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామంలో బొడ్రాయి నిర్వహణ కమిటి ఆధ్వర్యంలో వేకువజామున 5 గం.లకు ఆలయాల శుద్ధి, అలంకరణ, ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామదేవతలైన కోటమైసమ్మ, పెద్దమ్మ, పోచమ్మ దేవతలకు బోనాలను సమర్పించారు. భారీ సంఖ్యలో బోనాలు తీశారు. కనకదుర్గ అమ్మవారికి జలాభిషేకం, హోమం తదితర కార్యక్రమాటు చేపట్టారు. సాయంత్రం పద్మశ్రీ అవార్డు గ్రహీత పద్మాలయ దేవిచే సీతా కళ్యాణం హరికథ పారాయణం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అచ్చంపేట ఎమ్మెల్యే డా. చిక్కుడు వంశీకృష్ణ, అచ్చంపేట వ్యవ సాయ మార్కెట్ కమిటి వైస్ ఛైర్మన్ జక్కా చంద్రశేఖర్‌రెడ్డి, ఎంపిపి అరుణ నరసింహారెడ్డి, స్థానికులు ప్రతాప్‌రెడ్డి, మాజీ సర్పంచ్ వీరయ్య, మాజీ ఎంపిటిసి వీరయ్య, హుస్సేన్, పర్వతరెడ్డి (రాజు), అచ్చంపేట కౌన్సిలర్ గార్లపాటి శ్రీనివాసగుప్తా, స్థానికులు అంజి, గ్రామస్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

వైభవంగా లక్ష్మీనరసింహ్మస్వామి సుదర్శనచక్రస్నానమహోత్సవం

- సాంప్రదాయరీతిలో అవభృతస్నానం

దేవరకద్ర,మే 24 ప్రభాతవార్త: మన్యంకొండ శ్రీ లక్ష్మీ వెంకటేశ్వరస్వామి అనుబంద దేవాలయమైన శ్రీలక్ష్మీనరసింహ్మస్వామి (ఓబులేశు) దేవస్థానంలో సుదర్శనచక్రస్నానమహోత్సవ పూజా మహోత్సవాన్ని శుక్రవారం అంగరంగా వైభవంగా జరిగింది. ప్రతి ఏడాది స్వామి వారి కళ్యాణమహోత్సవాన్ని ఘనంగా నిర్వహించడంఆనవాయితీగా వస్తుంది. ఈ నెల23 నుండి స్వామి వారి మహోత్సవాలు ప్రారంభమయ్యాయి. అందులో భాగంగానే ఈ పవిత్ర కార్యక్రమాన్ని కన్నుల పండులా నిర్వహించారు. ఈ సందర్భంగా అవభృతస్నానం పూజా కార్యక్రమాన్ని సాంప్రదాయరీతిలో నిర్వహించారు. ఈ సందర్భంగా పురోహితుల వేధమంత్రాల మద్య ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు.వివిధ ప్రాంతాల నుండి తరలి వచ్చిన భక్తులు అమ్మవారి పూజను తిలకించి భక్తి పార వశ్యంతో పులకించిపోయారు. భక్తుల హరినామశ్చరణతో దేవాలయం ప్రాంతం మారు మోగింది.అలాగే ఆచారం ప్రకారంస్వామి దంపతులకు వివిధ పూజను నిర్వహించారు. ఈ సందర్భంగా స్వామిదంపతులకు ప్రత్యేక అభిషేకాలు,అర్చనలు,తదితర పూజలను నిర్వహించారు. అనంతరం స్వామి వారిని గర్భగుడిలోకి తీసుకెళ్ళారు. దేవాలయం పురోహితులు,సిబ్బంది ఒకరిపైఒకరు రంగులు చల్లుకొన్నారు.అలాగే వివిధ పూజలను నిర్వహించారు.ప్రత్యేక అభిషేకాలు,అర్చనలు నిర్వహించారు.

అలంకరణలో దర్శనమిచ్చిన స్వామిదంపతులు : మన్యంకొండలో శ్రీ లక్ష్మీనరసింహ్మస్వామి వారి సుదర్శనచక్రస్నానమహోత్సవం సందర్భంగా స్వామి దంపతులు దేవస్థానం ఆవరణలో ఊరేగుతూ అలంకరణలో భక్త కోటికి దర్శనమిచ్చారు. రకరకాల పూలు,బంగారు ఆభరణాలతో స్వామిదంపతులను అలంకరించారు. ఆ కార్యక్రమాన్ని కనులారా తిలకించడానికి జిల్లా నలుమూలల నుండి భక్తులు మన్యంకొండకు అధిక సంఖ్యలో తరలివచ్చారు.కళ్యాణదాతలు,భక్తులకు అన్నప్రసాద కార్యక్రమాన్ని నిర్వహించారు.ఈ కార్యక్రమంలో దేవస్థానం చైర్మెన్ ఆళహరి మధుసూధన్‌కుమార్,ఆళహరి రామకృష్ణ,ఈఓ శ్రీనివాసరాజు,ప్రధాన పూజారులు రాజేశ్,నరసింహ్మాయ్య,పాలకమండలి సభ్యులు, పర్య వేక్షకుడు నిత్యానందచారి,సిబ్బంది సుదర్శన్, నారాయణరెడ్డి, శ్రీకాంత్, కోటకద్ర నాయకులు మల్లు నరసింహ్మారెడ్డి,పాలకమండలి సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

లక్ష్మీనరసింహ్మస్వామివారికి పూజలు చేస్తున్న చైర్మన్ ఆళహరి మధుసూధన్‌కుమార్, రంగులు చల్లుకొంటున్న ఆర్చకులు

చెరువులో అక్రమ మట్టి తరలింపుపై ఫిర్యాదు

వెల్దండ, మే 24 ప్రభాతవార్త: వెల్దండ మండలం చెదురుపల్లి గ్రామ పంచాయతీలోని తిరుపతి చెరువులో అక్రమంగా నల్లమట్టిని తరలిస్తున్నారనే సమాచారం మేరకు ఏఈ తిరుపతినాయక్ చెరువు వద్దకు వెళ్లి చూడగా మట్టి తరలింపుకు సిద్ధంగా ఉన్న హిటాచీ, లారీలు ఉండటంతో వెల్దండ పోలీసులకు ఏఈ ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ఏఈ మాట్లాడుతూ అనుమతులు లేకుండా అక్రమంగా నల్లమట్టిని తరలిస్తే ఊపేక్షించేది లేదని, మట్టి తరలిస్తున్నవారిపై కేసులు నమోదు చేసి చట్టరీత్య చర్యలు తీసుకుంటామన్నారు.

అమిస్తాపూర్ వద్ద మహిళ దారుణహత్య

భూత్పూర్,మే 24,ప్రభాతవార్త: భూత్పూర్ మున్సిపల్ పరిధిలోని అమిస్తాపూర్ వద్ద సాక్షి ఆఫీస్‌కు సమీపంలో శుక్రవారం గాజులపేట గ్రామానికి చెందిన దాసరి లక్ష్మి(32)ని గుర్తుతెలియని దుండగులు మహిళ మొహంపై బండ రాయితో మోది హత్య చేసినట్లు భూత్పూర్ ఎస్సై శ్రీనివాసులు తెలిపారు.మహిళ కుడిచేతిపై యాదమ్మ అనే పేరుతో పచ్చబొట్టు వేయించుకుని ఉన్నట్లు ఎస్సై తెలిపారు.ఈ మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు జరుపుతున్నట్లు ఎస్సై శ్రీనివాసులు తెలిపారు.హంతకుల ఆచూకి కోసం గాలింపు చర్యలు చేపట్టినట్లు ఎస్సై శ్రీనివాసులు తెలిపారు.

పిడుగు పాటుకు ఎద్దు మృతి

చిన్నచింతకుంట,మే 24 ప్రభాతవార్త : పిడుగుపాటుకు ఎద్దు మృతి చెందిన సంఘటన శుక్రవారం సాయంత్రం అమ్మాపూర్ గ్రామంలో చోటు చేసుకుంది. బాధితుడు, గ్రామస్తులు తెలిపిన వివరాల ప్రకారం గ్రామానికి చెందిన శివకుమార్ తన వ్యవసాయ పొలం వద్ద తన రెండు ఎద్దులను కట్టేశాడు. శుక్రవారం సాయంత్రం ఉరుము మెరుపులతో వర్షం కురవగా పిడుగుపాటుకు గురై ఎద్దు మృతి చెందిందని బాధితుడు తెలిపారు. వ్యవసాయానికి ఉపయోగపడే ఎద్దు మృతి చెందడంతో బాధితుడు తీవ్ర మనో వేదనకు గురయ్యారు. మృతి చెందిన ఎద్దు విలువ సుమారు రూ. 70 వేలు ఉంటుందని గ్రామస్తులు తెలిపారు.

ప్రమాద భరితంగా నీటిసంపు

నీటి సంపుపై తెరిచి ఉంచిన మాన్యువల్

చిన్నచింతకుంట,మే 24 ప్రభాతవార్త: మండల కేంద్రంలోని ప్రభుత్వ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో నీటి సంపు ప్రమాదభరితంగా మారింది. వేసవి సెలవుల కారణంగా ప్రతినిత్యం చిన్నారులు, యువకులు పాఠశాల ఆవరణలో ఆటలు ఆడతారు. ఆవరణలో స్టేజీ పక్కనే నీటి నిల్వకు గాను పది ఫీట్ల లోతు సంపును ఏర్పాటు చేశారు. కానీ ఈ నీటి సంపుపై మాన్యువల్ ఏర్పాటు చేసిన దానిని మూయకుండా తెలిసి ఉండడంతో నీటి సంపు నిండుగా నీటి నిల్వ ఉండడంతో ఆటలు ఆడేందుకు వచ్చే చిన్నారులు, యువకులు ఆటలాడే క్రమంలో నీటి సంపులో పడితే ఎవరు బాధ్యత తీసుకుంటారని పలువురు విమర్శిస్తున్నారు. ఇప్పటికైనా పాఠశాలల్లోని నీటి సంపుపై మాన్యువల్‌ను మూసి ఉంచేలా అధికారులు చర్యలు తీసుకోవాలని పలువురు కోరుతున్నారు.

మృతుని కుటుంబానికి చైర్మన్ పరామర్శ

భూత్పూర్,మే 24,ప్రభాతవార్త: భూత్పూర్ పట్టణ మున్సిపాలిటీ పదోవార్డుకు చెందిన యువకుడు గడ్డం శ్యాంకుమార్(23)అనారోగ్యంతో గురువారం రాత్రి మృతిచెందగా పలు పార్టీలకు చెందిన నాయకులు మృతుని కుటుంబానికి చేరుకుని శ్యాంకుమార్ మృతదేహానికి శ్రద్ధాంజలి ఘటించారు. విషయం తెల్సుకున్న పట్టణ మున్సిపల్ చైర్మన్ సత్తూర్ బస్వరాజ్ గౌడ్ శుక్రవారం మృతుడికి శ్రద్ధాంజలి ఘటించి,సానుభూతితో పాటు సంతాపాన్ని ప్రకటించారు. కుటుంబానికి తన వంతు సహాయంగా రు.ఐదు వేలు ఆర్థిక సహాయంఅందించారు.సంతాపం తెలిపినవారిలో బీఆర్ఎస్ సీనియర్ నాయకుడు సత్తూర్ నారాయణగౌడ్‌తో పాటు నాయకులు గడ్డం రాములు, గడ్డం ప్రేమ్‌కుమార్,సత్తూర్‌సురేష్‌గౌడ్,పులుగుర్లమల్లేష్,గడ్డం భీమస్వామి, బాలగళ్ల శ్రీను ఉన్నారు.బీజేపీ నుంచి పార్టీ రాష్ట్ర నాయకుడు సుదర్శన్, చీపుర్ల భీంసేన్,కాంగ్రెస్ నుంచి మండల కాంగ్రెస్ ప్రధాన కార్యదర్శి లిక్కి విజయ్ గౌడ్‌తో నాయకులు గడ్డంయాదయ్య,బజార్ పరుశురాం,ఎ సురేష్, గడ్డం నర్సింహులు,గడ్డంశ్రీనివాసులు,గడ్డంఅరవింద్‌కుమార్,వంకగాళ్ల శివ శంకర్, దొబ్బలియాదయ్యతదితరులుపాల్గొన్నిమృతునికి శ్రద్ధాంజలి ఘటించారు.

కెటి దొడ్డిలో శివయాత్ర

కెటిదొడ్డి, మే 24 ప్రభాతవార్త : కెటిదొడ్డి గ్రామంలో శుక్రవారం రోజు త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవా సమితి ఇందూ జ్ఞాన వేదిక కెటిదొడ్డి కమిటికి చెందిన సభ్యుడు కురవ డబ్బు రాముడు సత్తు పోవడం జరిగింది. దీనికి సంబంధించి శివ యాత్ర కార్యక్రమంలో భాగంగా ప్రబోధ సేవా సమితి సభ్యులు కెటిదొడ్డి కమిటి క్రిష్ణమూర్తి, అంజ నమ్మ, జగదీష్, బలిగేరి వీరన్న, నరసింహులు, రాధమ్మ, రాయచూరు నుండి శివరాజ్‌కుమార్, వీరేశ్, ఎక్లాస్‌పురం నుండి నరేష్, భాస్కర్, జోగులాంబ జిల్లా ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున గ్రామస్తులు 200ల మందికి పైగా పాల్గొన్నారు. శివయాత్ర కార్యక్రమం కెటిదొడ్డి పాత ఊరు నుండి కెటిదొడ్డి స్మశాన వాటిక వరకు జరిగింది. హైందవ సాంప్రదాయం ప్రకారం ఆధ్యాత్మిక విధానంలో ప్రతి మనిషి శరీరంలో పరమాత్మ, ఆత్మ, జీవాత్మలు ఉంటాయి. ఎవరైనా చనిపోయిన సందర్భంలో జీవుడు, ఆత్మ ఇద్దరూ వెళ్లిపోతారు. అప్పుడు ఆ శరీరంలో సర్వ వ్యాపి అయిన దేవుడు మిగిలి ఉండును. అప్పుడు ఆ శరీరంను శివము అని అంటారు.ఖననం చేసే వరకు జరిగే ప్రక్రియను శివయాత్ర అంటారు. సాక్షాత్తు శివుడికి చేసే పూజలు చేసినట్లు చేసి ఎంతో పవిత్రంగా తెల్ల వస్త్రాలు ధరించి భక్తులు శివయారతలో పాల్గొన్నారు. ఇది ఎంతో గొప్పగా పూర్వీకులు తెలిపిన విధానం ఇప్పుడు ప్రబోదాశ్రమ గురువు శ్రీశ్రీశ్రీ ఆచార్య ప్రబోధానంద యోగీశ్వరుల దివ్యగ్రంథాల మూలంగా ఇందూ జ్ఞానవేదిక ద్వారా తిరిగి హిందూ సంప్రదాయం ఆచరణ మొదలైందని తెలియజేశారు. కార్యక్రమంలో త్రైత సిద్ధాంతం ప్రబోధ సేవ సమితి ఇందూజ్ఞాన వేదిక కెటిదొడ్డి కమిటి అధ్యక్షుడు కృష్ణమూర్తి పాల్గొన్నారు.

ప్రారంభమైన ఇంటర్ సప్లమెంటరీ పరీక్షలు

వనపర్తి ప్రతినిధి మే 24 ప్రభాతవార్త: ఇంటర్ సప్లమెంటరీ పరీక్షలు మొదటి రోజు ప్రశాంతంగా ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారులు నిర్వహించారు. శుక్రవారం జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన ఇంటర్ సప్లమెంటరీ ప

కేటీఆర్ చిన్నంబావి చౌరస్తాలో చర్చకు సిద్ధమా?

రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు సవాల్

చిన్నంబావి,మే 24 ప్రభాతవార్త: చిన్నంబావి మండల పరిధిలోని లక్ష్మీపల్లి గ్రామంలో బుధవారం రాత్రి జరిగిన బిఆర్ఎస్ కార్యకర్త బొడ్డు శ్రీధర్‌రెడ్డి హత్యపై జ్యుడిషియల్ విచారణకు తాను సిద్ధంగా ఉన్నానని హత్యపై తన హస్త ముందని ఆరోపించిన కెటిఆర్! నిరూపించడానికి చిన్నంబావి చౌరస్తాలో చర్చకు సిద్ధమా! అంటూ రాష్ట్ర ఎక్సైజ్ శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు బిఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటార్‌కు సవాల్ విసిరారు. శుక్రవారం హైదరాబాద్ గాంధీ భవన్‌లో మంత్రి జూపల్లి కృష్ణారావు మాట్లాడుతూ కొల్లాపూర్ నియోజకవర్గ పరిధిలోని లక్ష్మీపల్లి గ్రామంలో జరిగిన శ్రీధర్‌రెడ్డి హత్యను జూపల్లి ప్రోత్సహించారని పలు ఆరోపణలు చేసి తన పరువుకు నష్టం కలిగించారని దమ్ము, ధైర్యం ఉంటే హత్య వెనుక అసలు కారకులెవరు ఉన్నారో పోలీస్ అధికారుల దర్యాప్తు అనంతరం పూర్తి విషయాలు బయట పడతాయని అంతవరకు ఆగకుండా హత్య జరిగి 24 గంటలు గడవక ముందే దర్యాప్తులో ఎలాంటి పురోగతి తెలియంది సంబంధం లేని విషయాన్ని తనకు అంటగట్టడం బిఆర్ఎస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ కెటిఆర్ దిగజారుడు తనానికి నిదర్శనమని జూపల్లి కృష్ణారావు దుయ్యబట్టారు. అధికారం కోల్పోయి మతభ్రమించి లేనిపోని ఆరోపణలు చేస్తున్న కేటీఆర్ రాజకీయాలకు పనికి రాదని విలువలు లేని రాజకీయాలు చేయొద్దని ఆయన హితవు పలికారు. అక్రమ బిల్లులు, ఫామ్ హౌస్ దొంగలు బిఆర్ఎస్ పార్టీలోని పక్కన చేరిన దొంగలు కనిపించరా అంటూ ప్రశ్నించారు. కొల్లాపూర్ నియోజకవర్గంలో జరిగిన హత్యల వెనుక తమ హస్తం ఉన్నట్లుగా ఆరోపించడం సబబు కాదని దమ్ముంటే చిన్నంబావి చౌరస్తాలో చర్చించి నిరూపించడానికి సిద్ధమా? అంటూ సవాలు విసిరారు. తనను బిఆర్ఎస్‌లో బర్తరఫ్ చేయడంతో మిమ్మల్ని ప్రజలు ఎన్నికల్లో బర్తరఫ్ చేశారన్న విషయం మర్చిపోయారని అన్నారు. పనికి మాలిన ఆరోపణలు చేసే దద్దమ్మలకు త్వరలోనే బుద్ధి చెప్తామని ఇలాగే తమ ధోరణి మారకపోతే పరువు నష్టం దావా వేసి కోర్టు చుట్టు తిప్పుతానని హెచ్చరించారు. కాంగ్రెస్ పార్టీ పిసిసి ఉపాధ్యక్షులు మల్లురవి మాట్లాడుతూ కృష్ణారావుపై ఆరోపణలు సబబు కాదని, తాను విలువలు గల రాజకీయ నాయకుడని హత్యపై పూర్తి దర్యాప్తు చేపట్టి నిందితులకు కఠిన శిక్ష వేయాలని డిమాండ్ చేశారు.

మాట్లాడుతున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

ఆదర్శవంతమైన పోలీస్ అధికారిగా ఎదగాలి

- మల్టీ జోన్ 2 ఐజి సుధీర్‌బాబు
- డిటిసిని సందర్శించిన ఐజి

మహబూబ్‌నగర్ బ్యూరో,మే 24 ప్రభాతవార్త: ప్రతి పోలీసు ఉద్యోగి నిబద్ధతతో పనిచేసే అందరితో స్నేహ పూర్వకంగా మెలిగి ఆదర్శ పోలీసులు రాణించాలని మల్టీజోన్ 2 ఐజి సుధీర్‌బాబు అన్నారు. జడ్చర్ల మండల కేంద్రం శివారులోని డిస్ట్రిక్ట్ ట్రైనింగ్ సెంటర్‌ను మల్టీజోన్ 2 ఐజి సుధీర్‌బాబు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఐజి మాట్లాడుతూ పోలీస్ డిపార్టుమెంట్‌లో ఉద్యోగం చేయడం వలన సమాజ సేవలో పాల్గొన్నట్లే అని అన్నారు. అందరూ నిబద్ధతతో పని చేయాలని అనునిత్యం ఇండోర్, అవుట్ డోర్ శిక్షణపై దృష్టి సారించాలన్నారు. నాలెడ్జ్ పెంచుకొని సమాజం గర్వించేలా విధులు నిర్వహించాలని, ప్రస్తుతం ప్రజలను మోసం చేసే విధానాలు చాలా మారాయని, అందులో ముఖ్యమైనది సైబర్ నేరాలు అని గుర్తు చేశారు. సైబర్ నేరాల పట్ల మంచి శిక్షణ తీసుకుని ప్రజలలో సైబర్ నేరాలపై అవగాహన కల్పించాలని అన్నారు. ఎంత క్రమశిక్షణగా ఉంటే అంత మంచిదని అలాగే మంచి శిక్షణ పొందగలుగుతారన్నారు. మీరందరూ మంచి శిక్షణ పొంది, శిక్షణ కేంద్రానికి జిల్లాకు మంచి పేరు తీసుకురావాలని అన్నారు. అనంతరం డిటిసిలో మొక్క నాటారు. కార్యక్రమంలో ట్రైనీ ఐపిఎస్ చిత్తరంజన్, అదనపు ఎస్పీ రాములు, డిటిసి డీఎస్పీ నర్సింలు, మహబూబ్‌నగర్ డీఎస్పీ వెంకటేశ్వర్లు సిబ్బంది పాల్గొన్నారు.

మాట్లాడుతున్న ఐజి సుధీర్‌బాబు

సమావేశానికి హాజరైన పోలీస్ అధికారులు, సిబ్బంది

లోకల్ బాడీ కలెక్టర్ ఆకస్మిక తనిఖీ

వనపర్తి ప్రతినిధి మే24 ప్రభాతవార్త: మున్సిపాలిటీ ఆకస్మికంగా లోకల్ బాడీ కలెక్టర్ సంచిత్ గంగ్వార్ తనిఖీ చేశారు. శుక్రవారం మున్సిపాలిటీ కార్యాలయంలోని కమిషనర్ ఛాంబర్‌లో వివిధ విభాగాల అధికారులతో సమీక్ష నిర్వహించారు. మెప్మా , రెవెన్యూ, శానిటేషన్, ఇంజనీరింగ్ విభాగాల అధికారులో వేరువేరుగా అధికారులతో శాఖపరమైన అంశాలపై జరుగుతున్న పనులపై ఆయన ఆరాదీశారు. రెవెన్యూ విభాగంలో పన్ను వసూలు చేయడంలో లక్ష్యాన్ని చేరుకోలేదని, ముందస్తు ప్రణాళికతో పన్ను పన్నులపై దృష్టి పెట్టాలని సూచించారు. విభాగంలో పట్టణ జనాభా ధమాషా ప్రకారం సరిపడంతా కార్మికులు ఉన్నారా అని అడిగి తెలుసుకున్నారు. టౌన్ ప్లానింగ్ అధికారి గైర్హాజరుపై అసహనం వ్యక్తం చేసినట్లు సమాచారం. ఆడిట్ రిపోర్టుపై, పలు కీలక రికార్డులను పరిశీలించారు. ఈ సమీక్ష సమావేశంలో మున్సిపల్ కమిషనర్ పూర్ణచందర్,సానిటరీ ఇన్స్పెక్టర్ ఉమామహేశ్వర్ రెడ్డి, రెవెన్యూ అధికారి అనిల్‌కుమార్, ఏఈ సాయికిరణ్ , డీఈ మెప్మా అధికారులు ఉన్నారు.

13.7 కిలోల నకిలీ విత్తనాలు పట్టివేత

మక్తల్,మే 24 ప్రభాతవార్త: ఉట్కూర్ పోలీస్ స్టేషన్ పరిధిలో నిడుగుర్తి గ్రామంలో టాస్క్ ఫోర్స్, ఉట్కూర్ పోలీసులు పక్కా సమాచారంతో దాడులు నిర్వహించి భీమప్పకు చెందిన ఇంట్లో అక్రమంగా 13.7 కిలోల నకిలీ పత్తి విత్తనాలు నిల్వ ఉంచి రైతులకు అమ్ముతున్నాడన్న సమాచారంతో పోలీసులు నకిలీ పత్తి విత్తనాలను పట్టుకుని పోలీస్ స్టేషన్‌కు తరలించి ఏఓ గణేష్‌రెడ్డి పంచనామా అనంతరం నిడుగుర్తి భీమప్పపై కేసు నమోదు చేయడం జరిగిందనిఉట్కూర్ ఎస్సై తెలిపారు.

ఉచిత వేదిక్ గణిత అవగాహన సదస్సు

సమావేశంలో మాట్లాడుతున్న ఫౌండేషన్ కన్వీనర్ ధర్మతేజ

కొల్లాపూర్,మే 24 ప్రభాతవార్త : వేదిక్ గణిత అవగాహన సదస్సును రత్నగిరి ఫౌండేషన్ ఆధ్వర్యంలో కొల్లాపూర్, పరిసర గ్రామ విద్యార్థినీ, విద్యార్థులకు గణిత శాస్త్రంపై ఉన్న భయాన్ని పోగొట్టి దానిపట్ల ఆసక్తి కలిగించేలా మెలకువలు తెలియజేయడానికి గణిత సదస్సును నిర్వహిస్తున్నట్లు రత్నగిరి ఫౌండేషన్ కన్వీనర్ కేతూరి ధర్మతేజ తెలిపారు. శుక్రవారం ఫౌండేషన్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ తక్కువ సమయంలో గణితంలో ప్రశ్నలు ఛేదించి సమాధానాలు రాబట్టేలా నిష్ణాతులైన వేదిక్ గణిత ఆర్థమేటిక్, రీజనింగ్ ట్రైనర్ టి. వెంకటేష్‌చే ఈనెల 26వ తేదీ ఆదివారం ఆరవ తరగతి నుండి పదవ తరగతి విద్యార్థినీ, విద్యార్థులకు వేదిక్ మాథ్స్ అవగాహన కార్యక్రమాన్ని కొల్లాపూర్ మిని స్టేడియంలోని హాల్‌లో ఉదయం 9 గం.ల నుండి మధ్యాహ్నం 1 గం.ల వరకు నిర్వహించడం జరుగుతుందని ఫౌండేషన్ కన్వీనర్ కేతూరి ధర్మతేజ తెలిపారు. అవకాశాన్ని విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తుకై ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ప్రొఫెసర్ జయశంకర్ విశ్వవిద్యాలయంని సందర్శించిన రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షుడు

వనపర్తి ప్రతినిధి మే 24 ప్రభాతవార్త: రాజేంద్ర నగర్‌లో ఉన్న ప్రొఫెసర్ జయశంకర్ వ్యవసాయ విశ్వవిద్యాలయం సెంట్రల్ ఇన్స్ట్రుమెంట్స్ విభాగంలో అధికారులతో మాట్లాడుతూ వివరాలను అడిగి రాష్ట్ర ప్రణాళిక సంఘం ఉపాధ్యక్షులు జిల్లెల చిన్నారెడ్డి తెలుసుకున్నారు.

అమ్మ ఆదర్శ పాఠశాలల్లో అన్ని వసతులు కల్పించాలి

- జిల్లా పరిషత్ సీఈఓ యాదయ్య

ఆత్మకూరు మే 24 ప్రభాతవార్త: రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టనున్న అమ్మ ఆదర్శ పాఠశాలల్లో ప్రభుత్వం తరపున అన్ని వసతులు కల్పించనున్నట్లుగా వనపర్తి జిల్లా పరిషత్ సీఈఓ యాదయ్య వెల్లడించారు. శుక్రవారం రోజు మండల కేంద్రమైన ఆత్మకూర్ పట్టణంలోని ఎంపీడీవో కార్యాలయంలో జరిగిన ఆత్మకూర్, మదనాపూర్ మండలాల ఉపాధి హామీ పనుల సమీక్ష సమావేశానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. ఈ సందర్భంగా జడ్పీసీఈఓ మాట్లాడుతూ గత సంవత్సరం ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టేటువంటి స్మశాన వాటికలు క్రీడా ప్రాంగణాలు హరితహరాల కార్యక్రమాన్ని నిర్విగ్నంగా కొనసాగించడమే కాకుండా రాబోయే వర్షాకాలంలో ఈజీఎస్ పథకం కింద పెద్ద ఎత్తున మొక్కలు నాటేందుకు ప్రభుత్వం చర్యలు చేపట్టనున్నట్లుగా ఆయన వెల్లడించారు. అంతేకాకుండా ఉపాధి హామీ పథకానికి సంబంధించి ఎలాంటి అవకతవకలకు పాల్పడిన సంబంధిత ఎంపీఓలు ఫీల్డ్ అసిస్టెంట్లపై కఠిన చర్యలు తీసుకుంటామని ఆయన హెచ్చరించారు. ఈ కార్యక్రమానికి ఆత్మకూరు ఎంపీడీవో సుజాత అధ్యక్షత వహించగా ఎంపీఓలు నర్సింగ్ రావు , పుష్ప, రెండు మండలాలకు సంబంధించిన గ్రామపంచాయితీ సెక్రెటరీలు ఫీల్డ్ అసిస్టెంట్లు తదితరులు పాల్గొన్నారు.

సరైన ప్యాకింగ్ ఉన్న విత్తన ప్యాకెట్లు మాత్రమే రైతులకు విక్రయించాలి

జిల్లా వ్యవసాయధికారి గోవిందనాయక్ ఆదేశాలు

గద్వాల ప్రతినిధి మే 24 ప్రభాతవార్త : సరైన ప్యాకింగ్ ఉన్న విత్తన ప్యాకేట్లు మాత్రమే రైతులకు విక్రయించాలని జిల్లా వ్యవసాయాధికారి గోవింద నాయక్ అన్నారు. నకిలీ విత్తనాలు విక్రయిస్తే కఠిన చర్యలు తీసుకొంటామని హెచ్చరిర చేశారు. ఆధ్వర్యంలో గద్వాల డివిజన్ పరిధిలోని విత్తన డీలర్ల అవగాహన కార్యక్రమము నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా గోవింద నాయక్ మాట్లాడుతూ విత్తన డీలర్లు సరియైన ప్యాకింగ్ ఉన్న కంపెనీ నుండి వచ్చిన విత్తనములు మాత్రమే అమ్మవలెనవి అన్నారు. రైతులు తీసుకున్న విత్తనాలకు సరైన రసీదు ఇవ్వలెనని, విత్తన రిజిస్టరు రోజు వారిగా అప్ డేట్ చేయవలేను అన్నారు. వ్యవసాయ శాఖ నుండి పంపిన ప్రత్యేక పట్టికను రోజువారిగా అప్ డేట్ చేయవలెనని సూచించారు.విత్తన కొనుగోళ్ళలో తీసుకోవలసిన జాగ్రత్తలపై అవగాహన కార్యక్రమము ప్రతిగ్రామ పంచాయతీ యందు నిర్వహించుచున్నట్లు ఆయన తెలిపారు. ఈ సమావేశంలో టెక్నికల్ ఏడిఏ, డివిజన్ ఏడిఏ సంగీత లక్ష్మి, మండల వ్యవసాయధికారి ప్రతాప్ కుమార్ హరిశంకర్ రెడ్డి, శంకర్ నాయక్, శంకరయ్య, ఉషరాని, అనూష అన్ని మండలముల వ్యవసాయధికారులు పాల్గొన్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా వ్యవసాయశాఖ అధికారి గోవిందనాయక్

అమ్మ ఆదర్శ పాఠశాలల్లో పనులను త్వరగా పూర్తి చేయాలి

■ గద్వాల జిల్లా కలెక్టర్ బి.యం సంతోష్

గద్వాల ప్రతినిధి మే 24 ప్రభాతవార్త: అమ్మ ఆదర్శ పాఠశాలల్లో చేపట్టవలసిన కనీస మౌలిక వసతులకు సంబంధించిన పనులను త్వరితగతిన పూర్తిచేయాలని జిల్లా కలెక్టర్ బి.యం సంతోష్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టరేట్ సమావేశం మందిరంలోని సమావేశ మందిరంలో అమ్మ ఆదర్శ పాఠశాలల్లో చేపట్టిన పనులపై సంబంధిత అధికారులతో మండలాల వారిగా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతుల కల్పనకు చేపట్టవలసిన పనులను త్వరితగతిన పూర్తిచేయాలని అన్నారు. వారం రోజులలో అన్ని పాఠశాలల్లో కనీసం 50 శాతం పనులు పూర్తి కావాలన్నారు. చేపట్టే పనులకు నిధుల కొరత లేదని, చేపడుతున్న పనులన్నీ నాణ్యత ప్రమాణాలతో చేపట్టాలన్నారు. పాఠశాలలు పున ప్రారంభం అయ్యేలోగా పనులన్నీ పూర్తి కావాలన్నారు. మండల ప్రత్యేక అధికారులు, ఎంపీడీఓలు, ఎంపీఓలు క్షేత్ర స్థాయిలో ఎప్పటికప్పుడు పనులను పర్యవేక్షించాలని సూచించారు. పనులలో నిర్లక్ష్యం వహిస్తే తీవ్ర చర్యలు తప్పవని హెచ్చరించారు.

అమ్మవారి సన్నిధిలో బోథ్ ఎమ్మెల్యే

అలంపూర్ మే 24 ప్రభాతవార్త : ప్రముఖ క్షేత్రం అష్టాదశ శక్తి ఒకటైన ఐదవ శక్తి పీఠం అలంపూర్ క్ష జోగులాంబ బాల బ్రహ్మేశ్వర స్వామి ఆలయాలను ఆదిలాబాద్ జిల్లా బోథ్ నియోజకవర్గ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ శుక్రవారం దర్శించుకున్నారు. ముందుగా ఆలయ మర్యాదలతో ఎమ్మెల్యేకు ఆలయ అధికారులు స్వాగతం పలికారు అనంతరం ఉభయ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అదేవిధంగా తెలంగాణ బీసీ సంక్షేమ శాఖ జాయింట్ సెక్రటరీ తిరుపతి జోగులాంబ మాతను దర్శించుకున్నారు. అనంతరం అమ్మవారికి స్వామి వార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు.

సబ్ రిజిస్టర్ కార్యాలయం కోసం కేటాయించిన స్థలాన్ని పరిశీలించిన మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్

వనపర్తి ప్రతినిధి మే 24 ప్రభాతవార్త: వనపర్తి జిల్లాలోని నాగవరం శివారు దగ్గర సబ్ రిజిస్టర్ కార్యాలయం కేవలం కొందరు రియల్ ఎస్టేట్ వ్యాపారస్తుల కోసమే గతంలో గుట్టల మధ్యలో సబ్ రిజిస్టర్ కార్యాలయ నిర్మాణం కోసం శంఖుస్థాపన చేశారని మున్సిపల్ చైర్మన్ పుట్టపాకల మహేశ్, వైస్ చైర్మన్ పాకనాటి కృష్ణ అన్నారు. నాగవరం శివారులో గల సబ్ రిజిస్టర్ కార్యాలయం కోసం కేటాయించిన స్థలాన్ని శుక్రవారం నాడు మున్సిపల్ చైర్మన్, వైస్ చైర్మన్లు పరిశీలించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఎలాంటి జన సంచారం లేని స్థలం, నిర్మాణయోగ్యంగా ఉండే స్థలంలో సబ్ రిజిస్టర్ కార్యాలయం నిర్మించేందుకు మాజీ మంత్రి తప్పుడు నిర్ణయం తీసుకున్నదని అప్పట్లోనే ఈ వ్యవహారాన్ని కౌన్సిల్ పూర్తిగా వ్యతిరేకించిందన్నారు. కేవలం చుట్టు పక్కల గల వెంచర్లకు మేలు చేకూర్చడం కోసమే గుట్టల మధ్యలో కార్యాలయం నిర్మించేందుకు లోపాయికారి ఒప్పందంతో మభ్యపెట్టాలనుకున్నారని మండిపడ్డారు. సబ్ రిజిస్టర్ కార్యాలయం అంటేనే డబ్బులతో కూడుకున్న వ్యవహారమని, గుట్టల మధ్యలో కార్యాలయం ఉంటే దొంగలకుదారి చూపించినట్లే అవుతుందన్నారు.పట్టణ ప్రజల వ్యతిరేకత, మున్సిపల్ కౌన్సిల్ వ్యతిరేకతతో నిర్మాణ పనులు గతంలోనే నిలిపేశారని,తాజాగా గుట్టుచప్పుడు కాకుండా లోలోపల నిర్మాణ పనులు జరుగుతున్నాయని అన్నారు.రోడ్లు భవనాలశాఖ, పంచాయితీరాజ్ శాఖ వంటి ప్రభుత్వ అధీనంలో కాకుండా ప్రభుత్వ స్థలంలో ప్రైవేటు వ్యక్తులు రాత్రికిరాత్రి నిర్మాణ పనులు చేయడంచట్ట వ్యతిరేకమన్నారు. ఇప్పటికే నోటీసులు జారీ చేశామని, మరోసారి నోటీసులు జారీ చేసి చట్టపరంగా ప్రభుత్వ స్థలంలో నిర్మిస్తున్న ప్రైవేటు కట్టడాన్ని కూల్చివేయడంజరుగుతుందన్నారు.ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు, నక్క రాములు,కంచెరవి,నాయకులుయాదగిరి,శేఖర్, వినోద్ గౌడ్ ఉన్నారు.

గాలివాన బీభత్సం

నేలకొరిగిన భారీ వృక్షాలు,
ధ్వంసమైన రేకుల షెడ్లు,
నిలిచిన విద్యుత్ సరఫరా

మహబూబ్‌నగర్ బ్యూరో, మే 24 ప్రభాతవార్త : ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లా వ్యాప్తంగా శుక్రవారం సాయంత్రం పలుచోట్ల ఈదురు గాలులతో కూడిన వర్షం కురిసింది. మహబూబ్‌నగర్‌లో పెద్ద ఎత్తున ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. వర్షానికి రోడ్డుకు ఇరువైపులా చెట్లు నెలకొరిగాయి. పట్టణంలో పలుచోట్ల రేకుల ఇండ్లు కూలిపోయాయి. 14వ వార్డు వీరభద్ర కాలనీలో కవిరాజు అనే వ్యక్తికి చెందిన రేకుల ఇంటి పైకప్పు కూలిపోయింది. ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నానని ఉన్న ఇల్లు కూలిపోవడంతో ప్రభుత్వం తననాదు కోవాలని వేడుకుంటున్నారు.భారీ వృక్షాలు నేలకొరగడంతో విద్యుత్ అంతరాయం ఏర్పడింది.

మక్తల్,మే 24 ప్రభాతవార్త : మండలంలోని సామన్‌పల్లి, మంతన్‌గౌడ్, జక్లేర్ గ్రామాలలో గాలివాన బీభత్సం సృష్టించింది. ఒక్క సారిగాగాలివాన రావడంతో వృక్షాలు రోడ్లపై పడి రాకపోకలకుఇబ్బంది కలిగింది. గ్రామంలో ఉన్న ఇండ్ల వద్ద ఉన్న చెట్లు విరిగిపడి గ్రామస్తులకు రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. ఉన్నట్టుండి ఒక్క సారిగా వర్షం పడిగాలి ఎక్కువగా వీయడంతో, విద్యుత్ స్తంభాలు కూడా కూలిపోయాయి. తద్వారాగ్రామంలోవిద్యుత్‌కు అంత రాయం కలిగింది. ప్రజలు ఆందోళనకు గురయ్యారు.

గద్వాల ప్రతినిధి మే 24 ప్రభాతవార్త : గద్వాల నియోజకవర్గంలో శుక్రవారం సాయంత్రం ఉరుములు, మెరుపులతో కూడిన భారీ వర్షం కురిసింది. ఈదురు గాలులకు పలు గ్రామాల్లో చెట్లు నెలకొరిగాయి ఉరుములు, మెరుపులతో వర్షం పడడంతో విద్యుత్ సరఫరాను నిలిచివేశారు. ఒక్క సారిగా వాతావరణం చల్లబడ్డది వాతావరణం భానుడు కాస్త శాంతించాడు ఇక్కసారిగా చల్లబడింది రెండు రోజుల క్రితం వరకు జిల్లాలో పలు ప్రాంతాల్లో 38 డిగ్రీల గరిష్ట ఉష్ణోగ్రతలు నమోదైన విషయం తెలిసిందే. వాతావరణంలోమార్పులతో ఉక్కపోత కాస్త తగ్గడంతో ప్రజలు ఉపశ మనం పొందారు. సుమారు గంటకు పైగా వర్షం కురిసింది.రోడ్డు పక్కన,ఇండ్ల మధ్య నఉన్న చెట్లు,కొమ్మలు విరిగి పడిపో వడంతో ప్రజలు రాకపోకలకు ఇబ్బందులు పడ్డారు.

అయిజ మే 24 ప్రభాతవార్త : అయిజ మండల కేంద్రంలో శుక్రవారం గాలి వాన బీభత్సంతో పలు చెట్లు రోడ్లపై విరిగి పడడంతో పాటు చిన్న చితక రేకుల షెడ్లు టీ బంకులు లేచిపోయి ధ్వంసం అయ్యాయి ఒక్కసారిగా విచ్చిన గాలివాన పట్టణంలో పలు ఇండ్లలోకి నీరు చేరుకున్నాయి దీంతో పట్టణవాసులు భయభ్రాంతులకు గురయ్యారు అలాగే పెద్దవాగు నిర్మిస్తున్న బ్రిడ్జి పనులు పూర్తియిన బ్రిడ్జి పై రాకపోకలు కొనసాగుతున్నాయి. ఈ అకాల గాలివాన బీభత్సానికి చెట్టు విరిగి రోడ్డుపై అడ్డం పడడంతో రాకపోకలు నిలిచి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు లోనయ్యారు. రానున్న రోజుల్లో వర్షాలు ఎక్కువైతే ఈ చిన్న బ్రిడ్జి పై రాకపోకలు బంద్ అయ్యే అవకాశం ఉన్నందున మెయిన్ బ్రిడ్జి పనులు పూర్తి చేసి బ్రిడ్జి రాకపోకలు ప్రారంభించాలని అయిజ పట్టణవాసులు మండల పరిసర గ్రామాల ప్రజలు అధికారులను ప్రజా ప్రతినిధులు కోరుతున్నారు.

గాలివానకు విరిగి పడ్డ చెట్లు

గాలివానకు చెల్లాచెదురైన రేకుల డబ్బా

లోక్‌అదాలత్‌పై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న న్యాయవాదులు

లోక్ అదాలత్‌ను సద్వినియోగం చేసుకునేలా చూడాలి

-సీనియర్ సివిల్ జడ్జి సూరి కృష్ణ

జహీరాబాద్, మే 24, ప్రభాతవార్త: జూన్ 8న జరిగే జాతీయ లోక్ అదాలత్‌ను ప్రజలు, కక్షిదారులు సద్వినియోగం చేసుకునేలా న్యాయవాదులు కృషి చేయాలని సీనియర్ సివిల్ జడ్జి కె.సూరికృష్ణ సూచించారు. శుక్రవారం పట్టణంలోని కోర్టులో ప్యానెల్ న్యాయవాదులతో ప్రత్యేకంగా సమావేశం అయ్యారు. ఈ సందర్భంగా సూరి కృష్ణ మాట్లాడుతూ లోక్ అదాలత్‌లో పరిష్కారం అయ్యే కేసులపై ఆరా తీశామన్నారు. లోక్ అదాలత్ వల్ల కలిగే ప్రయోజనాలపై కక్షిదారులకు అవ గాహన కల్పించాలన్నారు. రాజీమార్గంతో కేసులను పరిష్కరించు కుంటే కలిగే ప్రయోజనం (డబ్బు, సమయం ఆదా)పై ప్రజలకు, కక్షి దారులకు వివరించాలన్నారు. ఇదిలా ఉండగా కోహీర్ మండలంలోని నాగిరెడ్డిపల్లి గ్రామ ప్రజలు భూ పంపిణి విషయంలో సందేహాలను ప్యానెల్ న్యాయ వాది సోమశేఖర్ తహసీల్దార్ కార్యాలయంలో నివృతి చేశారు. మండల లీగల్ సర్వీసెస్ కమిటి, జహీరా బాద్ కార్యాలయంను, న్యాయవాదు లను సంప్రదిస్తే తగు సూచనలు, సలహాలు అందచేస్తారన్నారు. సమా వేశంలో బార్ అసోసియేషన్ అధ్యక్షులు గోపాల్, ప్యానెల్ న్యాయవాదులు, లీగల్ సర్వీసెస్ సిబ్బంది, పారా లీగల్ వలంటీర్లు పాల్గొన్నారు.

విద్యుత్ సరఫరాలో అంతరాయం లేకుండా చూడాలి

యూత్ కాంగ్రెస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గోపికృష్ణ

మున్సిపల్ కమిషనర్‌కు వినతి పత్రం అందజేస్తున్న దృశ్యం

సిద్దిపేట అర్బన్, మే 24, ప్రభాతవార్త : పట్టణంలోని విద్యుత్ వైర్లకు చుట్టూ ఉన్న చెట్లను తీసివేయాలని వాటి వల్ల విద్యుత్ సరఫరా నిలిచిపో తుందని దీంతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని రాష్ట్ర యూత్ కాం గ్రెస్ కార్యదర్శి పూజల గోపికృష్ణ అన్నారు. ఈ మేరకు శుక్రవారం సిద్దిపేట పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో కమిషనర్ ప్రసన్నరాణికి వినతి పత్రం అందజేసి మాట్లాడారు. అకాల వర్షాలతో పాటు గాలిదూమరం లేచి నప్పుడు చెట్లు విరిగి విద్యుత్ వైర్లపై పడడంతో విద్యుత్ సరఫరా నిలిచిపో తుందన్నారు. రాష్ట్రంలో ఎక్కడా విద్యుత్ ఇబ్బందులు రాకుండా సిఎం రేవంత్‌రెడ్డి తగుచర్యలు తీసుకుంటున్నారని తెలిపారు. బిఆర్ఎస్ సర్కారు హయాంలో హరితహారం పేరిట ఇష్టరీతిగా పనికి రాని మొక్కలు నాటగా అవి చెట్లుగా ఎదిగి ప్రజలను అనారోగ్యాలకు గురి చేస్తున్నాయన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు మహిపాల్‌రెడ్డిచ సీతాబాలు, కరణకర్ సంబమూర్తి, రాజిరెడ్డి, ప్రతాప్, నర్సింగ్ యాదవ్, అంజిరెడ్డి, మహేందర్‌రెడ్డి, ప్రశాంత్, జనార్ధన్, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా అన్నమయ్య జయంతి మహోత్సవం

అన్నమయ్య గీతాలను ఆలపిస్తున్న చిన్నారులు

సిద్దిపేట రూరల్, మే 24, ప్రభాతవార్త : ప్రముఖ ఆధ్యాత్మిక గాయ కులు అన్నమయ్య పవన్ నిర్వహణలో తొలి తెలుగు వాగ్గేయకారుడు త్రాళ్లపాక అన్నమాచార్యుల 616వ జయంతి సందర్భంగా స్వామి దివ్య మూర్తికి అభిషేకం, అర్చన కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో అన్నమయ్య పవన్, శిష్యబృందం అన్నమయ్య సంకీర్తన గానం చేశారు. అనంతరం ఆలయ అర్చకులు అన్నమయ్య పవన్ బృందానికి వేదాశీర్వచనం చేసి స్వామి వారి తీర్థ ప్రసాదాలు అందజేశారు.

నాలా నుంచి నీరు వెళ్లేలా పనులు

-సొంత నిధులను వెచ్చించిన కార్పొరేటర్

నాలా నుంచి నీరు పోయేలా పనులు చేయిస్తున్న కార్పొరేటర్ పుష్పనగేష

రామచంద్రాపురం, మే 24, ప్రభాతవార్త: ఇటీవల కురిసిన అకాల వర్షాలకు రామచంద్రాపురం డివిజన్ పరిధిలోన అశోక్‌నగర్, జ్యోతినగర్ కాలనీల మధ్య ఉన్న నాలా నుంచి నీరు ప్రవహించకపోతుండటంతో ప్రజలు పడుతున్న పాట్లను పరిష్కరించేందుకు స్థానిక కార్పొరేటర్ బూరు గడ్డ పుష్పనగేష్ ప్రత్యేక చర్యలు తీసుకున్నారు. నాలా నుంచి నీరు ప్రవ హించేలా కార్పొరేటర్ సొంత నిధులను వెచ్చించి జెసిపి బ్రేకర్ సహాయంతో శుక్రవారం పనులు దగ్గరుండి చేయించారు. ఇదిలా ఉండగా 70 లక్షల రూపాయలతో నూతన బాక్స్ డ్రైన్‌తో కూడిన నాలాకు నిధులు మంజూరు కావడంతో కాంట్రాక్ సంఘటన స్థలానికి చేరుకున్నారు. జిహెచ్ఎంసి పరిధిలోని కాంట్రాక్టర్‌ల సమ్మె కొనసాగుతున్నందున పనుల నిర్వాహణలో కొంత ఆలస్యం అయిందని కార్పొరేటర్ బూరుగడ్డ పుష్పనగేష్ పేర్కొన్నారు. సమ్మె ముగిసిన అనంతరం నాలా పనులు ప్రారంభించి వర్షా కాలం లోపు పనులు పూర్తి చేయించి ప్రజలు పరేషాన్ కాకుండా చర్యలు తీసుకుంటామన్నారు. నాలా పనులు పూర్తి అయ్యాక సిసి రోడ్డును నిర్మించి కాలనీల్లో సమస్యలు లేకుండా చూస్తామని ప్రజలకు కార్పొరేటర్ హామి చేశారు. కార్పొరేటర్ వెంట పాండురంగాచారి, సాంబశివరావు,, ఖలీం, శేఖర్, నిషాద్, పద్మ, మాలతీ పవన్ తదితరులు ఉన్నారు.

టిఆర్ఎస్ కార్యకర్తకు రూ. 2 లక్షలు అందజేత

నర్సాపూర్, మే 24, ప్రభాతవార్త :

నర్సాపూర్ మండలం పెద్దచింతకుంట గ్రామ పంచాయతీ పరిధిలోని పాప్యతండాకు చెందిన రమావత్ బాస్కర్ ఇటీ వల పాము కాటుతో మృతి చెందాడు. కాగా భాస్కర్ బిఆర్ఎస్ పార్టీ సభ్యత్వం తీసుకొని టిఆర్ఎస్ పార్టీ కార్యకర్తగా పని చేశాడు. ఈమేరకు దురదృష్టావశాత్తున బాస్కర్ మృతి చెందడంతో టిఆర్ఎస్ సభ్యత్వం పాలసీ ద్వార మంజూరైన 2 లక్షల చెక్కును శుక్రవారం నర్సాపూర్ పట్టణంలోని ఎమ్మెల్యే సునీతా రెడ్డి నివాసంలో మృతుడు బాస్కర్ భార్య నిర్మల కు ఎమ్మెల్యే సునీతారెడ్డి చేతుల మీదుగా 2 లక్షల చెక్కును అందజేశారు.ఈ కార్యక్రమంలో ఎంపిపి ఉపాధ్యక్షులు వెంకటనర్సింగరావు, తాజామాజీ సర్పంచ్ గుండె శివకుమార్,నాయకులు భిక్షపతిగౌడ్,అడ్వోకేట్ సత్యనారాయణ, అంజయ్య, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

చేర్యాల రెవెన్యూ డివిజన్ సాధన కోసం పోరాటాన్ని కొనసాగిస్తాం

జెఏసి, అఖిలపక్ష నేతల తీర్మానం

సమావేశంలో పాల్గొన్న జేఏసి, అఖిలపక్ష నేతలు

చేర్యాల, మే 24,ప్రభాతవార్త: చేర్యాల రెవెన్యూ డివిజన్ సాధన కోసం పోరాటాన్ని కొనసాగించాలని చేర్యాల జేఏసి, అఖిలపక్ష పార్టీల నాయకులు శుక్ర వారం పట్టణంలోని ఓ ఫంక్షన్ హాల్‌లో సమావేశం నిర్వహించి తీర్మానంచేశారు. ఆల్‌ఇండియా ఫార్వర్డ్ బ్లాక్ జిల్లా కార్యదర్శి అందే బీరన్న అధ్యక్షతన సమావేశం జరిగింది. ఈ సందర్భంగా జేఏసి, అఖిల పక్ష పార్టీల నాయకులు మాట్లాడుతూ చేర్యాల రెవెన్యూ డివిజన్ కోసం ఏడు సంవత్సరాలుగా ఉద్య మం చేస్తున్నామన్నారు. చేర్యాల, కొమురవెల్లి, మద్దూరు, దూల్మిట్ట మండలాల్లోని యాభై మూడు గ్రామాల ప్రజలు స్వచ్ఛందంగా ఈ పోరాటంలో అంచెలంచలుగా పాల్గొంటున్నారని చెప్పారు. గత ప్రభుత్వం అసెంబ్లీ ఎన్నికల్లో ముఖ్యమంత్రితో పాటు పల్లా రాజేశ్వర్‌రెడ్డి చేర్యాలను రెవెన్యూ డివిజన్ చేస్తామని వాగ్దానాలు చేసి మాట తప్పారన్నారు. జనగామాలో నిర్వహించిన బహిరంగ సభలోనూ రెవంత్‌రెడ్డి హామి ఇచ్చారని తెలిపారు. అధికారం లోకి వచ్చి ఆరు నెలలు గడిచినా కాంగ్రెస్ పార్టీ రెవెన్యూ డివిజన్‌పై మాట్లాడకపోవడం సిగ్గుచేటని, కాంగ్రెస్ పార్టీ నాయకులను ప్రజలు అడుగడుగునా నిలదీయాలన్నారు. డివిజన్ కోసం ప్రజల మద్దతు తో జేఏసి, రాజకీయ నాయకుల, అన్ని కుల సం ఘాలతో కలిసి జూన్ 1వ తేదీన సమావేశమై పోరాటా కార్యాచరణ రూపొందిస్తామని తెలిపారు. ఈలోపు ప్రభుత్వం స్పష్టమైన ప్రకటన చేయాలని లేదంటే ఉద్యమం ఉధృతం చేస్తామని హెచ్చరించారు. సమావేశంలో సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి ఆము దాల మల్లారెడ్డి, జేఏసి నాయకులు తాడెం ప్రశాంత్, బిజ్జ రాము, బిజెపి జిల్లా ఉపాధ్యక్షుడు బూరుగు సురేష్, జిల్లా కార్యదర్శి తోకల ఉమారాణి, టిడిపి నాయకులు మిట్టపల్లి నారాయణ, మాలమహానాడు రాష్ట్ర కార్యదర్శి బుట్టి సత్యనారాయణ, మాజీ సర్పంచ్ తాడూరి రవీందర్, సిపిఎం నాయకులు కొంగరి వెంట్‌మావో, ఆలేటి యాదగిరి, చొప్పరి రవికుమార్, రాళ్లబండి నాగరాజు, బండకింది అరుణ్‌కుమార్, బోయిని మల్లేశం, ఆముదాల నర్సి రెడ్డి, ఎర్రబోస్ అశోక్, ముస్యాల ప్రభాకర్, మంచాల నారాయణ,కుర్మ సంఘం నాయకులు కామళ్ల అనిల్, ఓరుగంటి శంకర్ తదితరులు పాల్గొన్నారు.

సర్ సివి రామన్ సైన్స్ మ్యూజియంను పరిశీలిస్తున్న కలెక్టర్ వల్లూరు క్రాంతి

సైన్స్ మ్యూజియంను పరిశీలించిన కలెక్టర్

సంగారెడ్డి టౌన్, మే 24, ప్రభాతవార్త: సంగారెడ్డి పట్టణంలోని పాత డిఆర్‌డిఓ కార్యాలయ ప్రాంగణంలో ఏర్పాటు చేసిన సర్ సివి రామన్ సైన్స్ మ్యూజియంను శుక్రవారం జిల్లా కలెక్టర్ వల్లూరు క్రాంతి పరిశీలించారు. మ్యూజియం ఆవరణలో సైన్స్ ప్రాజెక్టులను, మ్యూజియం బయట గల బోలానికల్ గార్డెన్‌లోని మొక్కలను కలెక్టర్ పరిశీలించారు.మ్యూజియం అభివృద్ధికి సంబంధించిన సలహాలు సూచనలు అందచేశారు. కార్యక్రమంలో జిల్లా విద్యాధికారి వెంకటేశ్వర్లు, డిఆర్‌డిఏ పిడి జ్యోతి, సెక్టోరియల్ అధికారి వెంకటేశం, జిల్లా సైన్స్ అధికారి పి సిద్దారెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలు కేంద్రాల సమస్యలను పరిష్కరించాలి

తహశీల్దార్ కార్యాలయంలో రికార్డులు పరిశీలిస్తున్న ఆర్‌డీవో రమాదేవి

రామాయంపేట మున్సిపాలిటీ, మే 24, ప్రభాతవార్త : డివిజన్ పరిధిలోని ధాన్యం కొనుగోలు కేంద్రాల సమస్యలను గడువులోపల పరిష్కరించాలని మెదక్ ఆర్డీవో రమాదేవి సిబ్బందికి సూచించారు. శుక్రవారం నాడు ఆమె రామాయంపేట తహశీల్దార్ కార్యాలయాన్ని ఆకస్మికంగా సందర్శించారు. ఈ సందర్భంగా ఆమె మండల సిబ్బందితో సమీక్ష సమావేశం నిర్వహించారు. సమావేశంలో సిబ్బందికి పలు సూచనలు చేశారు. అదేవిధంగా ప్రజావాణి దరఖాస్తుల విషయం, ధరణి, ధాన్యం కొనుగోలు కేంద్రాల సమస్యలపై సిబ్బంది అప్రమత్తంగా ఉండాలన్నారు. ప్రతి సమస్యలను గడువులోపల పరిష్కరించేవిధంగా చూడాలని సిబ్బందికి సూచించారు. అనంతరం తహశీల్దార్ కార్యాలయంలోని పలు రికార్డులను పరిశీలించి, పలు సూచనలు, సలహాలు ఇవ్వడం జరిగిందని స్థానిక తహశీల్దార్ రజినీ కుమారి తెలిపారు.

ధాన్యం కొనుగోలును వేగవంతం చేయాలి

జిల్లా ప్రత్యేక అధికారి భారతీ హోళికేరి

నర్సాపూర్ మే 24, ప్రభాతవార్త : ధాన్యం కొనుగోలు కేంద్రాల్లో ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలని జిల్లా ప్రత్యేక అధికారి భారతీ హోళి కేరి స్థానిక అధికారులకు సూచించారు.శుక్రవారం నర్సాపూర్ పట్టణంలోని మార్కెట్ యార్డులో కొనసాగుతున్న ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని మరియు మండల పరిధిలోని కాగజ్‌మద్దూర్ లో కొనసాగుతున్న ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆమె సందర్శించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ ధాన్యం కొనుగోలును వేగవంతం చేసి అదనంగా లారీలను ఏర్పాటు చేసి రైస్ మిల్లులకు తరలించాలని అన్నారు.ధాన్యంలో తేమ శాతం లేకుండా తూకం వేయాలని సిబ్బందికి సూచించారు. రైతుల నుండి ప్రతిధాన్యం గింజను కొనుగోలు చేయాలని అన్నారు.ప్రతి రోజు కొనుగోలు కేంద్రాల పై ప్రత్యేకదృష్టి పెట్టాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు కలెక్టర్ వెంకటేశ్వర్లు,డిఎస్‌వో బ్రహ్మారావు,నర్సాపూర్‌ఆర్డీవో జగదీశ్వర్‌రెడ్డి, తహశీల్దార్ కమలాద్రి, ఆర్ఐ సిద్దిరాంరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

అధికారులతో మాట్లాడుతున్న భారతీ హోళి కేరి



తహసీల్దార్‌కు వినతిపత్రం అందజేస్తున్న బిజెపి నాయకులు

వర్షాలతో తడిసిన ధాన్యాన్ని కొనుగోలు చేయాలి

-బిజెపి మండల అధ్యక్షుడు టేకులపల్లి బాల్‌రెడ్డి

వర్గల్, మే 24 (ప్రభాతవార్త): వర్షాలతో తడిసిన ధాన్యాన్ని ప్రభుత్వం వెంటనే కొనుగోలు చేయాలని బిజెపి మండల అధ్యక్షుడు టేకులపల్లి బాల్‌రెడ్డి డిమాండ్ చేశారు. శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద బిజెపి శ్రేణులు నిరసన ప్రదర్శన చేపట్టిన అనంతరం తహసీల్దార్‌కు వినతిపత్రం అంద జేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికల సందర్భంగా కాంగ్రెస్ పార్టీ ఇచ్చిన ప్రతి హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. అలాగే రైతులు పండించిన ధాన్యానికి రూ.500 బోనస్ చెల్లిస్తామని హామీ ఇవ్వగా ప్రస్తుతం సన్నరకం ధాన్యానికి మాత్రమే వర్తింపజేస్తామని ప్రకటిం చడం సిగ్గుచేటన్నారు. సిఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీ మేరకు సన్న, దొడ్డు రకాలకు బోనస్ చెల్లించాలన్నారు. రైతులు పండించిన చివరి ధాన్యం గింజ వరకు కొనుగోలు చేయాలని, సాగుకు సరిపడా విత్తనాలు, ఎరువులు అందు బాటులో ఉంచాలని, రైతు పెట్టుబడి సహాయం, సబ్సిడీపై సూక్ష్మ సేద్యం పరికరాలను ప్రభుత్వం సరఫరా చేయాలని స్పష్టం చేశారు. అకాల వర్షాలతో నష్టపోయిన రైతులను ఆదుకోవాలని డిమాండ్ చేశారు.కార్యక్రమంలో బిజెపి ప్రధానకార్యదర్శి పంజాల వెంకట్‌గౌడ్, నేతలు శ్రీనివాస్‌రెడ్డి, రవీందర్‌గౌడ్, ప్రదీప్‌గౌడ్, నరేందర్‌రెడ్డి, నాగరాజుగౌడ్, నరేందర్‌రెడ్డి, మధుసూదన్‌రెడ్డి, మఠం మహిపాల్‌యాదవ్, పాండు, మహేష్, ప్రశాంత్‌గౌడ్ పాల్గొన్నారు.

డ్రైనేజీ పనుల ఆలస్యంతో ప్రజలకు తప్పని తిప్పలు

డ్రైనేజీ పనులను పరిశీలిస్తున్న సీపీఐ నాయకులు

బెజ్జంకి, మే 24, ప్రభాతవార్త : మండల కేంద్రంలోని ఎస్సీ కాలనీనుంచి ఎల్లంపల్లి వెళ్లే మార్గంలో చేపట్టిన డ్రైనేజీ పనులు చేపట్టి నెల రోజులు గడుస్తున్నా ముందుకు మాత్రం సాగడం లేదని సీపీఐ నాయకులు మండి పడుతున్నారు. శుక్రవారం మండల కేంద్రంలో చేపట్టిన డ్రైనేజీ పనులను సీపీఐ పార్టీ అధ్వర్యంలో నాయకులు సంగెం మధు, బోనగిరి రూపేష్, మహేష్‌లు పరిశీలించి మాట్లాడారు. పనులు ప్రారంభించి నెల రోజులు గడిచిపోతున్న పనులు మాత్రం ఓ కొల్కి రావడం లేదన్నారు. డ్రైనేజీ పనులు నత్తనడకన నడుస్తుండడంతో కాలనీ వాసులు, ఈ మార్గం గుండా వెళ్లే ప్రయాణీకులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. సంబంధితశాఖ అధికారుల పర్యవేక్షణ పూర్తిగా కరువైందన్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి డ్రైనేజీ పనులు పూర్తి చేయించాలని డిమాండ్ చేశారు.

26న నాగదేవత , పోచమ్మ ఆలయాల వార్షికోత్సవం

నర్సాపూర్ మే, 24. ప్రభాతవార్త : ఈ నెల 26న నర్సాపూర్ మండలం రుస్తుంపేట గ్రామంలోగల డాక్టర్ దండెపు బస్వానందం ఆశ్రమంలో శ్రీసం తాన నాగదేవతా, శ్రీ పోచమ్మ దేవతా ఆలయాల ఆరవ వార్సికోత్స వాన్ని అదేవిదంగా డాక్టర్ బస్వానందం తల్లిదండ్రులు దండెపు ఈశ్వరప్ప పెంటమ్మ ల ఆలయ ప్రథమ వార్షికోత్స వాన్ని సైతం నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు ప్రముఖ హోమియోపతి డాక్టర్ దండెపు బస్వానందం తెలిపారు. ఈ సంద ర్భంగా ఆయన మాట్లాడుతూ ఈవార్షికోత్స వంలో గౌరవ అతిథులుగా బర్డీ పూర్ ఆశ్రమ ఫీఠాధిపతి శ్రీగిరిమహారాజ్‌స్వామి, రుస్తుంపేట ఆత్మానందా శ్రమ ఫీఠాధిపతి శ్రీరాజయోగి వెంకటస్వామి హాజరవుతున్నట్లు తెలిపారు. ఈ వార్షికోత్స వాల సందర్భంగా ఈఆలయాల్లో గణపతిహోమం, రుద్రాభిషేకం, కుంకుమార్చనలు, ఫీఠాధిపతుల సందేశాలు, మధ్యాహ్నం అన్నదానం నిర్వ హిస్తున్నట్లు తెలిపారు. అంతేగాక డాక్టర్ బస్వానందం తల్లిదండ్రులు దండెపు ఈశ్వరప్ప పెంటమ్మ ఆలయ ప్రథమ వార్షికోత్స వ కార్యక్రమం ఉంటుందన్నారు. ఆలయాల వార్షికోత్స వాలకు పరిసరా గ్రామాల ప్రజలు, భక్తులు అధిక సంఖ్యలో తరిలివచ్చి దైవ కృపకు పాత్రులై విజయవంతం చేయాలని ప్రముఖ హోమియోపతి డాక్టర్ దండెపు బస్వానందం కోరారు

రైతులకు కొనుగోలు బిల్లులు అందించాలి : ఎఒ

న్యాల్‌కల్, మే 24, ప్రభాతవార్త: రైతులు కొనుగోలు చేసిన విత్తనాలకు సంబంధించిన రశీదులు అందించాలని మండల వ్యవసాయాధికారి ఎన్. లావణ్య సూచించారు. శుక్రవారం న్యాల్‌కల్‌లోని రైతు వేదికలో మండల విత్తన డీలర్లతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఓ లావణ్య మాట్లాడుతూ రైతులు డీలర్ల నుంచి కొనుగోలు చేసిన ప్రతి ఒక్కరికి రశీదులు అందించాలని, రశీదుపై డీలర్‌తో పాటు రైతు సంతకం ఉండాలన్నారు దుకాణంలో రైతులకు అందించిన విత్తనాల వివరాలను రిజిష్టర్‌లో నమోదు చేయాలని సూచించారు. కార్యక్రమంలో ఆయా గ్రామాల విత్తన డీలర్లు, వ్యవసాయ విస్తీర్ణ అధికారులు పాల్గొన్నారు.

ఆయిల్ ఫాం సాగుపై రైతులకు అవగాహన

మనూర్, మే 24, ప్రభాతవార్త: ఆయిల్ ఫాం పంటకు దేశ వ్యాప్తంగా మంచి డిమాండ్ ఉందని, ప్రభత్వం సైతం పంట సాగుకు రైతుకు సబ్సిడీ అందిస్తోందని అందుకు రైతులు ఆయిల్ ఫాం పంట సాగు చేసుకుని ఆర్థికంగా లబ్దిపొందాలని గోద్రెజ్ ఏరియా మేనేజర్ వెంకటేశ్వర్లు అన్నారు. శుక్రవారం మనూర్‌లోని రైతు వేదికలో గోద్రెజ్ ఆగ్రోవెట్, వ్యవసాయ శాఖ ఆధ్వర్యంలో రైతులకు ఆయిల్ ఫాం సాగుపై అవగాహన కార్యక్రమం నిర్వ హించారు. ఈ సందర్భంగా గోద్రెజ్ ఏరియా మేనేజర్ వెంకటేశ్వర్లు మాట్లా డుతూ పంట సాగు కొరకు 90 శాతం సబ్సిడీతో మొక్కలు, 90 శాతం సబ్సిడీతో డ్రిప్ సౌకర్యం ప్రభుత్వం అందిస్తున్నందున రైతులు సబ్సిడీని సద్వినియోగం చేసుకుని ఆయిల్ ఫాం సాగుపై దృష్టి సారించాలన్నారు. పంట సాగుపై ఆసక్తి గల గోద్రెజ్ ఫీల్డ్ అధికారిని సంప్రదించాలన్నారు. కార్యక్రమంలో వ్యవసాయ విస్తీర్ణ అధికారులు సంగమేశ్వర్, ప్రవీణ్, సాయి కిరణ్‌రెడ్డి, మహేష్, గోద్రెజ్ ఫీల్డ్ అధికారి అజయ్, రైతులు పాల్గొన్నారు.

ఎంఈవో ప్రభుదాస్‌ను పరామర్శించిన కాంగ్రెస్ నాయకులు

మిరుదొడ్డి, మే 24, ప్రభాతవార్త : దుబ్బాక ప్రాంతీయ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ఎంఈవో జోగు ప్రభుదాస్‌ను మిరుదొడ్డి ఎంపిపి గజ్జల సాయిలు, కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మద్దెల రాజేశం శుక్రవారం పరామర్శించారు. ఈ సందర్భంగా వారు ఎఈవో ప్రభుదాస్ ఆరోగ్య పరిస్థి తిని అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో నాయకులు చెన్నై భూపాల్‌గౌడ్, అల్వాల తాజా మాజీ సర్పంచ్ ఎనగంటి కిష్టయ్య తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకుంటుంది

కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మహేందర్

చిన్నకోడూరు, మే 24, ప్రభాతవార్త : మండల పరిధిలోని మాచాపూర్ గ్రామంలో పున్నం మల్లయ్యకు చెందిన 65 గొర్రెలను హైనా దాడి చేసి చంపివేయడంతో ఆర్థికంగా నష్టపోయిన బాధితున్ని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మీసం మహేందర్ శుక్రవారం పరామర్శించి సంఘటన జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. అధైర్య పడకుండా ధైర్యంగా ఉండాలని 65 గొర్రెలు కోల్పోయిన బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకుంటుందని తెలి పారు. సంఘటన విషయాన్ని జిల్లా ఇంచార్జి మంత్రి కొండా సురేఖ దృష్టికి తీసుకెళ్లి ప్రభుత్వం నుంచి ఆర్థిక సహాయం అందించేలా చర్యలు తీసుకుంటా నని తెలిపారు. ఆయన వెంట పార్టీ నాయకులు సందబోయిన పర్శరాం, గణేష్, బర్ల స్వామి,పొన్నాల రాజేష్, గుండు వెంకట్ పాల్గొన్నారు.

సేవ కార్యక్రమాలే లక్ష్యంగా ముందుకు సాగాలి

సిద్దిపేట అర్బన్, మే 24, ప్రభాతవార్త : డిస్టిక్ వి 105 ఎ రీజియన్-3 జోన్-2 వాసవి క్లబ్ వనిత సిద్దిపేట అధ్వర్యంలో భారత్‌నగర్‌లో శ్రీ వృద్ధాశ్రమంలో పర్మినెంట్ ప్రాజెక్టు కింద క్యాస లక్ష్మీ బాలయ్య అర్థిక సహాయంతో బీరువాను వృద్ధాశ్రమ నిర్వాహకులు అంతయ్యకు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కార్యక్రమాల బాధ్యులు యాద శ్రీనివాస్ మాట్లా డుతూ సిద్దిపేట వనిత క్లబ్ అధ్వర్యంల చేపడుతున్న సేవ కార్యక్రమాలు అభినందనీయమన్నారు. పేదలను అదుకోవడానికి భవిష్ య త్‌లో మరిన్ని సేవ కార్యక్రమాలు చేపట్టాలన్నారు. కార్యక్రమంలో క్లబ్ ప్రతినిధులు మంకాల శ్రీనివాస్, తోడుపునూరి కృష్ణవేణి, మర్యాల వాణి, వీరేశం, బాలయ్య, మహేష్, శృతి, జయరాములు తదితరులు పాల్గొన్నారు.

వీరభద్రాలయంలో ప్రత్యేక పూజలు

టేక్మాల్, మే 24 ప్రభాతవార్త: మండల పరిధిలోని బొడ్మట్‌పల్లి శ్రీభద్ర కాళీ వీరభద్ర స్వామి బ్రహ్మోత్స వాల్లోనభాగంగా శుక్రవారం ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. రాత్రి అగ్ని గుండాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో హాజరై అగ్ని గుండం కార్యక్రమంలో పాలుపంచుకున్నారు. శ్రీ భద్రకాళీ వీరభద్ర స్వామి బ్రహ్మోత్స వాల్లోనభాగంగా శనివారం స్వామి వారి కళ్యాణోత్స వం నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ చైర్మన్ బస్వరాజ్ పాటిల్ అన్నారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని ఆ పరమ శివుని కృపకు పాత్రులు కావలని ఆయన కోరారు.

రక్తదానం చేసిన కాంగ్రెస్ నేత

కొల్చారం, మే 24 ప్రభాతవార్త: మండల పరిధిలోని సంగాయిపేట గ్రామానికి చెందిన యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షులు దర్జి రాజు తన మానవత్వాన్ని చాటుకున్నారు. అత్యవసర పరిస్థితుల్లో సంగారెడ్డి ప్రభుత్వ ఆసుపత్రిలో డయాలసిస్ పేషంట్‌కి రక్తం అవసరం ఉందని చెప్పగానే వెంటనే స్పందించి రక్తదానం చేశారు. రక్తదానం చేయడం చాలా ఆనందంగా ఉందని ఆయన తెలిపారు. ఇప్పటికీ 31 సార్లు రక్తదానం చేశానని, ఇకముందు ఇలాగే సామాజిక సేవ చేయడానికి, ప్రజలకు సేవ చేయడానికి సిద్ధంగా ఉన్నానని ఆయన తెలిపారు.

విత్తన కొనుగోలులో జాగ్రత్తలు అవసరం

రామాయంపేట, మే 24, ప్రభాతవార్త : వాతావరణ శాఖ అంచనాల ప్రకారం ఈ వర్షాకాలంలో సమృద్ధిగా వర్షాలు పడే అవకాశం ఉన్నందున పంట విస్తీర్ణం పెరిగే అవకాశం ఉంది. రైతులు తమ పంట సాగుకోసం వివిధ రకాల విత్తనాలను కొనుగోలు చేసే సమయంలో తగు జాగ్రత్తలు పాటించాల్సి ందిగా మండల వ్యవసాయ అధికారి రాజ్‌నారాయణ తెలిపారు. ఈ సందర్భంగా శుక్రవారం రామాయంపేట మండలం దంతేపల్లి, పర్వాతా పూర్ గ్రామాల్లో పర్యటించి రైతులకు విత్తనం కొనుగోలు చేసే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలు గూర్చి వివరించారు. రైతులు లైసెన్సు కలిగిన డీలర్ల వద్ద మాత్రమే విత్తనాలను కొనుగోలు చేయాలని తప్పనిసరిగా విత్తనానికి సంబంధించిన బిల్లును తీసుకోవాలని, కొందరు దళారులు గ్రామాల్లో తిరుగుతూ ఎలాంటి ప్యాకింగ్ లేకుండా విడిగా విత్తనాలను అమ్మినట్లయితే అవి ఎట్టి పరిస్థితుల్లో కొనుగోలు చేయరాదని అలాంటి వారి వివరాలను సంబంధిత వ్యవసాయ అధికారులకు సమాచారం అందించాలని తెలిపారు. కార్యక్రమంలో విస్తీర్ణ అధికారి సాయికృష్ణ, రైతులు పాల్గొన్నారు.

రైతుల వివరాలను నమోదు చేయాలి : ఎవో

చిన్నశంకరంపేట, మే 24, ప్రభాతవార్త:

విత్తనాలను తీసుకున్న రైతుల వివరాలను నమోదు చేయాలని మండల వ్యవసాయాధికారి లక్ష్మిప్రవీణ్ విత్తన డీలర్లకు సూచించారు. శుక్రవారం చిన్నశంకరంపేటలో విత్తన డీలర్ల సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వం అనుమతినిచ్చిన విత్తనాలను మాత్రమే విక్రయించాలని, అధిక అదరలకు అమ్మితే కటిన చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో ఏఈవో శ్రీనివాస్, మండల విత్తన డీలర్లు పాల్గొన్నారు.

కాంగ్రెస్ ప్రభుత్వంలో రైతుల కష్టాలు వర్ణనాతీతం

ఎమ్మెల్యే సునీతారెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సునీతారెడ్డి

నర్సాపూర్ మే 24, ప్రభాతవార్త :

క